
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

బుధవారం 21 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	33.9	26.5
కావలి	32	27
ఆత్మకూరు	34	24
ఉదయగిరి	32	26
కందుకూరు	32	27

ఆంధ్రజ్యోతి
అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



సొత్‌మోపూరులో నిర్మించిన అంతర్గత రహదారి

నేడే విజయోత్సవ సభ

- సొత్‌మోపూరుకు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఈడీ ఆదిత్య రాక
- అభివృద్ధి పనుల పరిశీలన
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' గ్రామసభలో వచ్చిన సమస్యలకు పరిష్కారం

నెల్లూరురూరల్, మే 20,(ఆంధ్రజ్యోతి): నగరానికి పశ్చిమాన 23 కి.మీ దూరంలో ఉన్న కుగ్రామం సౌత్‌మోపూరు. అంతర్గత రహదారుల్లేక ఇళ్లలోకి వర్షపునీరు చేరేది. ఇళ్లలో నుంచి మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులో ఉండేదికాదు. రక్షణగోడ లేని జడ్పీ హైస్కూల్, రోజురోజుకి ఆక్రమణలకు గురవుతున్న శ్మశానాలు... వెరసి సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ఆ గ్రామాన్ని ఆంధ్రజ్యోతి గుర్తించింది. గ్రామ సమస్యలను ప్రత్యేక కథనాల ద్వారా గత జనవరి చివరివారంలో వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆంధ్రజ్యోతి అధ్యక్షతన 'అక్షరం అండగా.. పరి ష్కారమే అజెండాగా...' గ్రామసభను నిర్వహించారు. సభలో గ్రామస్థులు ప్రస్తావించిన సమస్యలన్నిం టినీ పరిగణలోకి తీసుకున్నారు. వాటి పరిష్కారానికి ఆయన రూ. 1.22 కోట్లు మంజూరు చేయించారు. దీంతో ఆ సమస్యలన్నింటినీ గత మూడునెలల కాలంలో పరిష్కరిస్తున్నారు. కొన్ని పూర్తికాగా, మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు.

● ఏ పనికి ఎంతెంత ?

గ్రామంలోని వివిధ కాలనీల్లో రూ. 94 లక్షలతో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.16 లక్షలతో వాణిశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణగోడ నిర్మిస్తున్నారు. కనుజుల మిట్ట (ఎస్టీ కాలనీ) వద్ద రూ. 10 లక్షలతో శ్మశానానికి రక్షణగోడ నిర్మాణం పనులకు టెండర్లు పూర్తయ్యాయి. బీసీ కాలనీలో రచ్చబండపై శ్లాబుకు రూ. 2లక్షలతో బుధవారం శంకుస్థాపన జరగనున్నది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి వివిధ మార్గాల ద్వారా ఈ నిధులను సమీకరించి కేటాయింపులు జరిపారు. వారి పర్యవేక్షణతో ఫిబ్రవరిలో శంకుస్థాపన జరుపుకున్న పనులన్నీ పూర్తయ్యాయి.



నిర్మాణంలో ఉన్న జడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ

● పనుల పరిశీలన

గ్రామంలో రూ. 1.22 కోట్లతో జరిగిన/జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా చూసి, ప్రజలతో మమేకం అయ్యేందుకు బుధవారం సౌత్‌మోపూరుకి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఈడీ వేమూరి ఆదిత్య, టీడీపీ సీనియర్ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి రానున్నారు. ఉదయం 11 గంటలకు గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుంటారు. అక్కడ నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలిస్తారు. 11.10 గంటలకు వాణిశ్రీ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి, నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడను పరిశీలిస్తారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వేసిన సీసీరోడ్డు చూస్తారు. 11.20 గంటలకు బీసీకాలనీలో నిర్మించిన రచ్చ బండపైన రూ.2 లక్షలతో నిర్మించ తలపెట్టిన శ్లాబు పను లకు శంకుస్థాపన చేస్తారు. 11.30 గంటలకు బీసీకాలనీలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో జరిగే విజయోత్సవ సభలో పాల్గొంటారు. అనంతరం ప్రజలతో కొంతసేపు ముచ్చటిస్తారు.

జిల్లా నేతలకు
మహానాడు బాధ్యతలు

- వివిధ కమిటీల్లో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు ఇతర నాయకులు



వీపీఆర్



బీఎంఆర్

నెల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో నిర్వహించనున్న టీడీపీ మహానాడు నిర్వహణకు వివిధ కమిటీలను ఆ పార్టీ నియమించింది. ఆ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులకు స్థానం దక్కింది. వీరంతా ఆ మూడు రోజుల పాటు మహానాడు నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారు. సమన్వయ కమిటీలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు స్థానం దక్కింది. తీర్మానాల కమిటీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పీ కృష్ణయ్య సభ్యులుగా ఉన్నారు. భోజనాల ఏర్పాట్ల కమిటీలో ముఖ్య నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మీడియా కమిటీలో ఆక్వా కల్చర్ బోర్డు చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి ఉన్నారు. ఆర్థిక వనరుల కమిటీలో మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఫొటో ప్రదర్శన కమిటీకి కన్వీనర్‌గా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వ్యవహరించనున్నారు. సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీలో మళ్లీ బీద రవిచంద్రకు స్థానం దక్కింది. రవాణా కమిటీకు మంత్రి పొంగూరు నారాయణ కన్వీనర్ కాగా, అందులో సభ్యుడిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు. రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీకి డాక్టర్ జెడ్ శివప్రసాద్ కో-కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా, మురళీకన్నబాబు సభ్యుడిగా ఉన్నారు. జనసమీకరణ కమిటీ కోకన్వీనర్‌గా కూడా బీద రవిచంద్ర వ్యవహరిస్తున్నారు. ఇక వాహన పార్కింగ్ కమిటీలో ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి, సాంస్కృతిక కార్యక్రమాల కమిటీలో దోర్నాల హరిబాబు, ప్రతినిధుల నమోదు కమిటీలో నరాల సురేంద్ర, అలంకరణ కమిటీలో మలిశెట్టి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు.



ఆనం రామనారాయణరెడ్డి



పొంగూరు నారాయణ



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



బీద రవిచంద్ర

కామాక్షితాయికి
పురుషామృగ వాహనసేవ



పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం, మే20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారు పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుచ్చి ఉత్సవంలో గంగా,కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమి చ్చారు. ఈసందర్భంగా అంతరాల యంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తలకు ఉదయం, రాత్రి దాతల సాయంతో ఉచిత ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, సర్పంచు పెంచలయ్య తదితరులు పర్యవేక్షించారు. కాగా బుధవారం రాత్రి స్వామి, అమ్మవారు సింహవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.



రాజుపాలెం వద్ద పెన్నాలో ఇసుక తవ్వకాలకు అనధికారికంగా వేసిన రోడ్డు

ఆ టెండర్ వెనుక
ఆంతర్యమేమిటో...?

- రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్ అట..!
- ప్రాజెక్టు లేని చోట ఎలా చేస్తారో...?
- చర్చనీయాంశంగా జిల్లా అధికారుల తీరు
- ఒత్తిళ్లతోనే టెండర్ పిలిచినట్లు ప్రచారం
- బిడ్లకు ముగిసిన గడువు, నేడు ఓపెన్

నెల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): డీసిల్టేషన్ అంటే నదిలో ఓ ప్రాజెక్టుకు పైభాగంలో పేరుకు పోయిన పూడికను తొలగించడం.... తద్వారా ఆ ప్రాజెక్టు వద్ద నీటి నిల్వను పెంచడం ప్రధాన ఉద్దేశ్యం. ఇప్పటి వరకూ పెన్నా బ్యారేజీకి ఎగువ భాగంలో పోతిరెడ్డిపాలెం వద్ద, సంగం బ్యారేజీ పైభాగంలో సూరాయపాలెం, సంగం వద్ద జరుగుతున్న డీసిల్టేషన్ ఈ కోవలోకే వస్తుంది. ఇక్కడ పడవల ద్వారా డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే ఇసుకను బయటకు తెస్తున్నారు. అయితే తాజాగా జిల్లా అధికారులు పిలిచిన ఓ ఇసుక టెండర్ వివాదాస్పదమైంది. ఎలాంటి ప్రాజెక్టు లేని చోట, ఎటువంటి ఇసుక మేటలు లేని ప్రాంతంలో మానవశక్తి ద్వారా డీసిల్టేషన్ చేసేందుకు టెండర్లు ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. కలువాయి మండలం రాజుపాలెం వద్ద మానవశక్తి ద్వారా డీసిల్టేషన్ చేసేందుకు అధికారులు టెండర్లు పిలిచారు. ఈనెల 14 నుంచి బిడ్లు దాఖలు మొదలు కాగా మంగళవారంతో గడువు ముగిసింది. బుధవారం ఆ బిడ్లను అధికారులు ఓపెన్ చేయనున్నారు. 46 హెక్టార్లు (115 ఎకరాల్లో) డీసిల్టేషన్ చేసేందుకు అనుమతులు ఇచ్చారు. పెన్నానదిలో ఇంత పెద్ద విస్తీర్ణంలో మానవశక్తి ద్వారా ఎలా డీసిల్టేషన్ చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.



రాజుపాలెం వద్ద నిర్వహిస్తున్న అనధికార రీచ్‌కు తాళం వేసిన అధికారులు(ఫైల్)

● అనధికార రీచ్ ఏర్పాటు

రాజుపాలెం వద్ద కొన్ని నెలలుగా అనధికారికంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. కొందరు అక్రమార్కులు ఏకంగా పెన్నా నదిలోకి రోడ్డు వేసి భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిపారు. ఇక్కడి నుంచి తిరుపతి జిల్లాతోపాటు తమిళనాడుకు ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సోమశిల జలాశయానికి దిగువన మూడు కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ భారీ గుంతలు తవ్వితే, రేపు వరదలు వచ్చినప్పుడు కోతకు గురయ్యే ప్రమాదముందని స్థానికులు అడ్డుచెప్పారు. అయినా ఇసుకాసురులు లెక్కచేయలేదు. ఈ అక్రమ తవ్వకాల వ్యవహారం పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించారు. అనధికార ఇసుక రీచ్‌కు తాళం వేశారు. ఇప్పుడు అధికారికంగా ఏదో ఒక పేరుతో రాజుపాలెం వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతులు తెచ్చుకోవాలని తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే అధికారులపై ఒత్తిడి తెచ్చి మానవశక్తి డీసిల్టేషన్ పేరుతో టెండర్ పిలిపించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా కాలం నుంచి రాజుపాలెం వద్ద ఇసుక రీచ్ కోసం కొందరు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అక్కడ ఫీజుబులిటి సాధ్యం కాదని అధికారులు చెబుతూ వస్తున్నట్లు తెలిసింది. అందుకే గతంలో సంగం, సూరాయపాలెం, పోతిరెడ్డిపాలెం వద్ద డీసి ల్టేషన్‌కు టెండర్లు పిలిచినా, పీకేపాడు, మినగల్లు, విరువూరు, పల్లిపాడు, ముది వర్తిపాలెం వద్ద సెమీమెకనైజ్డ్‌కు టెం డర్లు పిలిచిన సమయంలోనూ రాజుపాలెంను పరిగణలోకి తీసుకోవడం లేదని మైనింగ్ వర్గాలు చెబుతు న్నాయి. అయితే ఇప్పుడు రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్‌కు టెండర్లు పిలవగా, ఆ ప్రాంతానికి అవతవల ఒడ్డును ఉన్న పీకేపాడులో మాత్రం గతంలోనే సెమీ మెకనైజ్డ్ తవ్వకాలకు టెండర్లు పూర్తి చేసి ఉన్నారు. ఒక ఒడ్డున సెమీ మెకనైజ్డ్ పిలిచి మరో వైపు మానవ శక్తి డీసిల్టేషన్ పిలవడ మేమిటన్న ప్రశ్న ఇక్కడ తలెత్తు తోంది. ఈ నెలాఖరు తర్వాత సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లన్నీ ఎన్జీటీ నిబంధనల ప్రకారం మూతపడతాయి. సెప్టెంబరు నెలాఖరు వరకూ తెరుచుకోవు. డీసిల్టేషన్ పాయింట్లు మాత్రమే ఆపరే షన్‌లో ఉంటాయి. కాబట్టే రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్ అని పేరు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మాటున యంత్రాలతో తవ్వకాలు జరుపుకునేందుకు స్కెచ్ వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా దీనిపై ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా రాజుపాలెం వద్ద బ్రిడ్జి ఉండడంతో డీసిల్టేషన్‌కు టెండర్లు పిలిచామని చెప్పడం గమనార్హం. మైనింగ్ అధికారులు ఫీజుబులిటీ ఇచ్చారని, ఈ విషయాన్ని మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆయన పేర్కొన్నారు.

సమాధానమేదీ..?

రాజుపాలెం వద్ద ఎలాంటి ఆనకట్టలు లేవు. అలాంటిది అక్కడ ఎందుకు డీసిల్టేషన్ చేస్తున్నారన్న ప్రశ్నకు ఇరిగేషన్ అధికారుల వద్ద సమాధానం లేదు. టెండర్ ప్రకటనలో సంగం బ్యారేజీ అప్‌స్ట్రీమ్‌లో డీసిల్టేషన్ అని పేర్కొన్నారు. అసలు సంగం బ్యారేజీకు, రాజుపాలెంకు సంబంధమే లేదు. అక్కడకు, ఇక్కడకు మధ్య దూరం 30 కిలో మీటర్లపైనే ఉంది. మరి రాజుపాలెం వద్ద డీసిల్టేషన్ చేయడంలో ఆంతర్యమేమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోంది. మనుషుల ద్వారా ట్రాక్టర్లకు ఎక్కడైనా లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. రాజుపాలెం వద్ద కూడా నేరుగా వెళ్లి ఉచితంగా ఇసుక తెచ్చుకునే అవకాశముంది. అలాంటిది మానవశక్తి డిసిల్టేషన్‌కు ప్రత్యేకంగా టెండర్లు పిలవడమేమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

యోగాసాధనతో
ఆరోగ్యకర జీవనం

- నెలపాటు గ్రామాలు, మండలాల్లో అభ్యాసం
- హైస్కూళ్లు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి



యోగాసనాలు చేస్తున్న కలెక్టర్ ఆనంద్



నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగాను సాధన చేస్తే ఆరోగ్యకర జీవనం సొంతమవుతుందని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహకాల్లో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం మెగా యోగాసాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని, యోగా సాధనతో ఎన్నో అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. నిత్యనూతనంగా, ఆరోగ్యంగా కనిపించాలంటే యోగాసాధన ఒక్కటే మార్గమని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గత పదేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ విశాఖకు రానున్నారని పేర్కొన్నారు. రానున్న నెలరోజుల్లో ప్రతి గ్రామ, మండల స్థాయిల్లో యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ప్రతి పాఠశాలలో, కళాశాలలో కూడా యోగా సాధనపై అవగాహన కల్పించాలని తెలిపారు.

● ఆసనాలు వేసిన కలెక్టర్

యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థులు, వాకర్స్, క్రీడాకారులతో కలిసి కలెక్టర్ ఆనంద్ యోగాసనాలు వేశారు. ప్రాణయామం, నాడీ సాధన, భుజంగాసనం, శలభాసనం, తదితర ఆసనాలను ఆయన సునాయాశంగా చేసి అందరిని ఉత్సాహ పరిచారు. అనంతరం నయాగో ఇండియా స్కూల్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా యోగా పోటీల విజేతలకు కలెక్టర్ బహుమ తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, నిర్వాహకులు విఘ్నేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, యోగా కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



యోగా పోటీల విజేతలతో కలెక్టర్ తదితరులు

పడుగుపాడు పంచాయతీ
కార్యదర్శి సస్పెన్షన్

- వివరాలు 8లో

నాడి పడితే ఒట్టు !

- అంతా రెఫరలే..
- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు పరుగు
- ప్రజలపై అదనపు భారం
- ఇదీ.. ఉదయగిరి సీహెచ్‌సీ పరిస్థితి

8 లో..

ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం



కిశోరి వికాసంపై అవగాహన

రాపూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం పునాది వేస్తుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ సునంద తెలిపారు. రాపూరు పరిధిలోని చానాయపాళెం ఎస్సి అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మంజుల, బాలికలు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9026
వెండి కిలో ధర	రూ. 98,100
వెండి ఒక గ్రాము	రూ. 101.10

క్రమశిక్షణకు మారుపేరు చంద్రబాబు

● మినీ మహానాడులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

కోవూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమశిక్షణకు మారుపేరని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. స్థానిక పీవీఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. నాయకులు, ప్రజాప్రతినిధులతో చంద్రబాబు చర్చించే తీరు చాలా బాగుంటుందని చెప్పారు. సహచర ప్రతినిధులతో ఎంతో గౌరవంగా ప్రవర్తిస్తారన్నారు. దగదర్తి విమానాశ్రయాన్ని ఏడాదిలోగా ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. దుగరాజుపట్నం ఓడరేవుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమరావతి అభివృద్ధికి రెండో పర్యాయం భూమి పూజ చేశారని చెప్పారు. ఎన్ని ఇబ్బందులున్నప్పటికీ తల్లికి వందనం పథకాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఎంతో పరిపాలనా అనుభవమున్న చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపనున్నారని చెప్పారు.


మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఎన్టీఆర్ అడుగుజాడల్లో చంద్రబాబు : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి


మినీ మహానాడులో పాల్గొన్న టీడీపీ నాయకులు,కార్యకర్తలు

ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు సేవలందిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కోసమే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. సమాజమే దేవాలయంగా భావించి పార్టీని తీర్చిదిద్దారనీ, చంద్రబాబునాయుడు పార్టీని క్రమశిక్షణతో నడుపుతున్నారని చెప్పారు. గ్రామస్థాయి నుంచే అభివృద్ధి, సంక్షేమ పథకాలను పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలన్నింటిలో తాగునీటి సమస్యలను వీపీఆర్ ఫౌండేషన్ సహాయంతో పరిష్కరించామన్నారు. గ్రామాల్లో శ్మశానాల సమస్యల్ని పరిష్కరించినట్లు వివరించారు. మినీ మహానాడులో రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాయకులు బూదాటి రాధాకృష్ణయ్య, పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, జెట్టి రాజగోపాలరెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ


ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, మే 20(ఆంధ్రజ్యోతి): వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని ఆమె నివాసంలో ఇందుకూరుపేట మండలం లోని నిడిముసలి గ్రామానికి చెందిన దివ్యాంగులకు మంగళవారం ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు దువ్వూరు పావని, మధుసూదన్‌రెడ్డి దంపతులు, విశ్వం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పొదలకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళ వారం శుభంగా ప్రారంభమయ్యాయి. తొలుత ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి.

10న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రాపూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం వెళ్లేందుకు రాపూరు, పొదలకూరు, కలువాయి, డక్కిలి మండల ప్రజల కోసం ఏపీఎస్ ఆర్టీసీ రాపూరు డిపో వారు గురుపౌర్ణమి సందర్భంగా జూన్ 10వ తేదీన ప్రత్యేక బస్ సర్వీస్ ఏర్పాటుచేశారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు పొదలకూరు నుంచి రాపూరు, డక్కిలి మీదుగా అరుణాచలం వరకు (వయా సిరిపురం గోల్డెన్ టెంపుల్) సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని రాపూరు ఆర్టీసీ డీఎం అనిల్ కుమార్ తెలిపారు. కావున కలువాయి, పొదలకూరు, రాపూరు, డక్కిలి ప్రజలు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ నందు తమ ప్రాంతం నుంచి అరుణాచలం వరకు రాను పోను టికెట్స్ రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఫోన్ నెంబర్లు 6303036216, 7205593111, 7382886451 ద్వారా బుక్ చేసుకోవాలని రాపూరు డిపో డీఎం తెలిపారు.

ఎన్‌సీసీ శిక్షణలో అదాని స్కూల్ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన అదాని స్కూల్ విద్యార్థులు

ముత్తుకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణలో ప్రతిభ చూపి పతకాలను సాధించిన అదానీ వరల్డ్ స్కూల్ సైనిక్ క్యాడెట్లను ప్రిన్సిపాల్ రాజేష్‌శర్మ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా అదాని వరల్డ్ స్కూల్ క్యాడెట్ శ్రీరామ్‌కు ప్రత్యేకంగా సార్జెంట్ హోదా లభించిందన్నారు. క్యాడెట్ అనువినేష్‌కు కార్పొరల్, క్యాడెట్ సంజీవ్, నేహా శ్రీక్షిత, వైష్ణవిలు లాన్స్ కార్పొరల్‌గా పదోన్నతులను, వైష్ణవి ఉత్తమ షూటర్‌గా, శ్రీరామ్ ఉత్తమ క్యాడెట్‌గా, నేహా శ్రీక్షిత ఉత్తమ బృంద నాయకురాలిగా పతకాలు అందుకున్నారన్నారు. ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణను సమాజం పట్ల సేవా భావాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిబిరంలో క్యాడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వం, పౌర సమాజ బాధ్యతలపై అవగాహన కల్పించడంతో పాటు, క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్యాడెట్లందరికీ వారి తల్లిదండ్రులు అడ్మిన్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ


ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసిన కమాండెంట్ కల్నల్ కరంచంద్, ఎన్‌సీసీ, ఆర్మీ అధికారులు

వెంకటాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కల్నల్ డీ కరంచంద్ ఆధ్వర్యంలో గత పదిరోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరం మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కల్నల్ కరంచంద్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో శిక్షణ ద్వారా దేశభక్తి, నైతిక విలువలు పెంపొందింపజేయడం, క్రమశిక్షణ, సాయంచేసే తత్వం అలవడతాయన్నారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, ఎన్‌సీసీ క్యాంపు అధికారి బాలబ్రహ్మాచారి, హరీష్‌రెడ్డి, మస్తాన్‌వలి, పెంచల పుల్లయ్య, దీప్తి, జయరాం, శ్రీపతిప్రసాద్, జావీద్ బాషా తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటి పర్తిపాళెం రైల్వే గేటు వద్ద కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివ రాల్లోకి వెళితే.. గూడూరు పట్టణానికి చెందిన కామేశ్వరరావు, వెంకటరమణయ్య ఇద్దరూ కలిసి మోటర్ బైక్‌పై కృష్ణపట్నం పోర్టుకు వెళ్లి తిరిగి వస్తుండగా తాటిపర్తిపాళెం రైల్వే గేటు వద్ద పోర్టు రోడ్డుపై వెళ్లే వాహనాలను చూసుకోకుండా సర్వేపల్లి నుంచి ఎగువమిట్ట వైపుగా వెళ్తున్న ఆటో ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొచ్చింది. ఈక్రమంలో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను సర్వేపల్లిలోని ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపు

కొండాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు ఆధార్‌కార్డులేని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంపై మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ సామాజిక వర్గంలో ఆధార్‌కార్డులు లేనివారితోపాటు కార్డు పోగొట్టుకున్నవారికి తిరిగి మంజూరు చేసేందుకు ఈనెల 30వ తేదీ నుంచి జూలై 6 వరకు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. 6 ఏళ్ల లోపు వారికి కచ్చితంగా పుట్టినతేది సర్టిఫికెట్లు ఉండాలని, 6 ఏళ్లు పైబడిన వారికి పంచాయతీ కార్యాలయంలో పుట్టినతేది సర్టిఫికెట్లు ఇచ్చేందుకు మార్గదర్శకాలను ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంపై ఎస్టీ కాలనీవాసులకు అవగాహన కల్పించాలని సూచించారు.

వేసవిలో పశువుల సంరక్షణకు ప్రాధాన్యం

● చంద్రమౌర్య, ఏడీఏ, పశుసంవర్ధక శాఖ

విడవలూరు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకాన్ని అధికంగా చేపడుతున్నారు. వేసవిలో పాడి పశువుల సంరక్షణకు పలు జాగ్రత్తలు తీసుకుంటే పశువులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. కనుక ఎలాంటి చర్యలు చేపట్టాలో పశుపోషకులకు అవగాహన కల్పిస్తున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీఏ చంద్రమౌర్య తెలిపారు.



? పశువులు ఎండ తీవ్రతకు తట్టుకొనేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

! ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పశువుల పాకలను గడ్డితో కప్పుకుని అప్పుడప్పుడు నీటితో తడుపు తుండాలి. గొర్రెలు, మేకలు ఎండలో మేతకు తీసుకుని పోకుండా ఉదయం, లేదా సాయంత్రం తీసుకుపోవడం మంచిది.

? వేసవిలో మూగజీవాలకు ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

! వేసవి సీజన్‌లో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి, జబ్బవాపు వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధులకు స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయాల్లో మందులు అందుబాటులో ఉన్నాయి.

? వేసవిలో పాలదిగుబడి తగ్గే అవకాశం ఉందా, ఉంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

! వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తాగి మేత తక్కువగా తింటాయి. ఈ కారణంగా పాలదిగుబడి తగ్గుతోంది. ఈ సమస్యను రైతులు అధిగమించాలంటే ఖనిజ లవణాలతో కూడిన మేత పశువులకు అందించాలి. మార్కెట్‌లో పోషక విలువలతో కూడిన మేతలు అందుబాటులో ఉన్నాయి.

కామాక్షితాయి భక్తులకు ప్రసాదాల వితరణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల దాతృత్వంతో ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఉత్సవాల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసేందుకు వారు సుమారు రూ.2 లక్షలకు పైగా వెచ్చించారు. ఈ నిధులతో చేపట్టిన ప్రసాదాల పంపిణీలో భాగంగా మంగళవారం టీడీపీ నాయకులు, సేవా కమిటీ సభ్యులు భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే బ్రహ్మోత్సవాలకు విద్యుద్దీపాలంకరణకు వేమిరెడ్డి దంపతులు రూ.6.60 లక్షల కేటాయించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ అధ్యక్షుడు తిరుమూరు అశోక్‌రెడ్డి, సభ్యులు టీ.నందకుమార్, ఎం.సుధాకర్, టీడీపీ నేత, సర్పంచు పెంచలయ్య, నాయకులు ఎస్.లక్ష్మీనరసారెడ్డి, జీ.ఉమ్మయ్య స్వామి, పీ.రత్నం, తదితరులు పాల్గొన్నారు.


జొన్నవాడ ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, తదితరులు

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

పొదలకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అన్నదానం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు భారీ కేక్ చేసి నాయకులు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు సాదం గిరీష్‌కుమార్, గంగవరపు వేణుగోపాల్‌రెడ్డి, బ్రహ్మదేవి రాజశేఖర్, పొదలకూరు నవీన్, అలిమేలి సునీల్‌కుమార్, కాసా వెంకట్, రమణ, సొరకొండ జయకృష్ణ నందమూరి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అభిమానులు, టీడీపీ నాయకులు

లింగవివక్షపై అవగాహన ర్యాలీ

పొదలకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం లింగ వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి లక్ష్మీ అక్షరాస్యత, ఆరోగ్యం, గ్రామాల్లో పాటిస్తున్న కట్టు బాట్లు, సాంప్రదాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ శ్వేత, వీఓ సుభాషిణి, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, పద్మ, ఆయా ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.


లింగవివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పోలేరమ్మ జాతరలో పోలీసుల సాక్షిగా రికార్డింగ్ డ్యాన్స్‌లు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని కట్టు బడిపాళెం వడ్డిపాళెంలో పోలేరమ్మ జాతరలో పాటకచ్చేరి పేరుతో అర్ధరాత్రి 12 నుంచి వేకువజాము 3గంటల వరకు యువతులు, మహిళల రికార్డింగ్ డ్యాన్స్‌లు ఉద్రూతలూగించాయి. పోలీసుల సాక్షిగా జరిగిన ఈ డ్యాన్స్ ప్రోగ్రాంతో ఆ ప్రాంతంలో మహిళలు ఆందోళనకు గురయ్యారు. గత రెండేళ్లుగా పోలే రమ్మ జాతరలో నిర్వహించిన డ్యాన్స్‌లతో ఒకే సమాజిక వర్గంలో రెండు వర్గాలకు జరిగిన వివాదాలు ఘర్షణలకు దారితీశాయి. ఈసారి జాతరలో డ్యాన్స్ ప్రోగ్రాంను పోలీసులే దగ్గ రుండి నడిపించడంపై స్థానికంగా విమర్శలకు దారితీసింది.

కాలువలో కారు బోల్తా

బుచ్చిరెడ్డిపాళెం, మే 20(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం బైపాస్‌రోడ్డులో అంబేడ్కర్ నగర్ ప్రాంతంలోని టీ దుకాణం ఎదురుగా రేబాల కాలువలో ఓ కారు బోల్తా పడిన ఘటన మంగళవారం వేకువజామున జరిగింది. ఈ కారు ముందుగా ఓ ఇంటి గోడను ఢీకొని వెళ్లి కాలువలో బోల్తా పడింది. కారు డ్రైవర్‌తో పాటు కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా కారులో ఉన్న వారు కట్టుబడిపాళెంలో సోమవారం రాత్రి 11 గంటల నుంచి వేకువజాము 3గంటల వరకు జరిగిన డ్యాన్స్ ప్రోగ్రాం చూసుకుని వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

● కార్మికుల నిరసన ర్యాలీ

కావలిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తక్షణం నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను కష్టాలపాలు చేసే కుట్ర పన్నిందన్నారు. ఇటువంటి దుర్మార్గపు లేబర్ కోడ్‌ల వలన కార్మికుల తమ హక్కుల సాధన కోసం సమ్మె చేసుకునేందుకు అవకాశం హక్కు కోల్పోతారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు పసుపులేటి పెంచలయ్య, మల్లి అంకయ్య, ఏఐఎఫ్‌టీయు న్యూ నాయకులు లక్ష్మారెడ్డి, కార్మిక నాయకులు శ్యామలమ్మ, కృష్ణమోహన్, దర్గాబాబు, కృష్ణయ్య పాల్గొన్నారు.



కావలిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సీఐటీయూ నిరసన

కందుకూరు : కేంద్రప్రభుత్వం విధించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కందుకూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని అంకమ్మ దేవాలయం వద్ద నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు వివిధ రంగాల కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్, జీవీబీ కుమార్, కొట్టె వెంకయ్య, ఎస్‌డీ గౌస్, గుత్తి మల్లిఖార్జున, సుంకర విజయలక్ష్మి, సీహెచ్ ఇందిరావతి, ప్రభావతి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుత్ స్తంభం పడి యువకుడి మృతి


వెంకటేష్ (ఫైల్)

కావలి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పడి మద్దెల వెంకటేష్ (32) మృతి చెందిన ఘటన మంగళవారం కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో జరిగింది. రెండవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన వెంకటేష్, సుబ్బారావులు మంచి స్నేహితులు. వెంకటేష్ బైక్ మెకానిక్ కాగా సుబ్బారావు ఉదయగిరి రోడ్డులోని వైన్ షాపు ముందు చికెన్ పకోడి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వర్షం పడుతుండంతో సుబ్బారావు తన చికెన్ పకోడి బండి వద్ద వర్షపు నీరు పడకుండా పట్టకట్టేందుకు వెంకటేష్‌ను తీసుకువెళ్లాడు. సుబ్బారావు స్టూలు వేసుకుని విద్యుత్ స్తంభానికి తీగతో పట్ట కడుతుండగా వెంకటేష్ స్తంభం పక్కన నిలబడి ఉన్నాడు. ఈ క్రమంలో ఆ విద్యుత్ స్తంభానికి సపోర్టుగా దెబ్బతిని ఉన్న మరో స్తంభం ఒక్కసారిగా రెండు ముక్కలుగా విరిగి ఒక ముక్క వెంకటేష్ తలపైన పడింది. దీంతో తలపగిలి మెదడు బయటకు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ గిరిబాబు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య మౌనిక, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేష్ మృతితో బాలకృష్ణారెడ్డి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్‌ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలే ప్రమాదాలకు కారణమవుతూ నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని మృతుడి బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత


పోలీసులు పట్టుకున్న చికెన్ వ్యర్థాల వాహనం

సంగం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని స్థానిక పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కోవూరుకు చెందిన కార్తీక అనే వ్యాపారి బెంగళూరు నుంచి చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా ముంబాయి జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. వాహనంలో 25 డ్రమ్ములలో ఉన్న చికెన్ వ్యర్థాలను కలిగిరి రహదారిలోని కొండ ప్రాంతంలో గుంతతీసి పూడ్చివేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

వీడని రాపూరు హత్య కేసు మిస్టరీ

● కొనసాగుతున్న దర్యాప్తు


సంఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసులు

రాపూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాపూరుకు చెందిన షేక్ షఫీ హత్య కేసు మిస్టరీ వీడ లేదు. హత్య జరిగి నాలుగైదు రోజులైనా ఎవరు చంపారు, ఎందుకు చంపారు అనే విషయం ఇంకా తేలలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. కూల్ డ్రింక్ షాప్ నిర్వహిస్తున్న షేక్ షఫీ (52) ఈనెల 16వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో దుకాణాన్ని మూసి ఇంటికి బయలుదేరాడు. తాతిపల్లి గ్రామ సమీపంలో అతను హత్యకు గురై విగత జీవిగా పడిఉన్నట్లు కొంతమంది స్థానికులు కండలేరు పోలీసులకు సమాచారమి చ్చారు. హుటాహుటిన వెళ్లిన కుటుంబసభ్యులు చనిపోయిన వ్యక్తి షఫీగా గుర్తించారు. ఈ సంఘటనతో రాపూరు మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.


షఫీ (ఫైల్)

కొనసాగుతున్న దర్యాప్తు

ఈ హత్య కేసును పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సేవలను వినియోగించుకొని దర్యాప్తు చేస్తున్నారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. రాపూరుకు చెందిన కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

గొలుసులు కొంటామంటూ దోచేశారు

● నలుగురు మహిళల అరెస్టు ● చోరీ సొత్తు స్వాధీనం


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), మే 20 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకు వెండి గొలుసు లు కొనుగోలు పేరుతో తియ్యటి మాటలు చెప్పిన మహిళలు ఏడు జతల గొలుసులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుతో చోరీకి పాల్పడిన నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరు కోటమిట్టకు చెదిన దగ్గోలు చెంచుముని రెడ్డి ఆ చారివీధిలో మేఘన శ్రీ జ్యూయిలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆ దుకాణానికి 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన ముగ్గురు మహిళలు వచ్చారు. కాళ్ళవ ట్టీలు(గొలుసులు) చూపించమని అడిగారు. వెండి పట్టీలను చూపిస్తుండగా మాయ మాటలు చెప్పి రూ.70 వేలు విలువ చేసే సుమారు 740 గ్రాముల బరువున్న 7 జతల పట్టీలను దోచుకెళ్లారు. మహిళలు షాపు నుంచి వెళ్లిన తర్వాత దొంగతనం జరిగినట్లు గుర్తించిన యజమాని చిన్నబజారు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్టు

ఈ కేసులో నిందితులను పట్టుకున్నట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం రాత్రి స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు చేశామని, నిందితులను అన్నమయ్య జిల్లా వావిలపాడు మండలం చింతపత్తి గ్రామానికి చెందిన గీత, జ్యోతి, రవళి, నరసమ్మగా గుర్తించామని చెప్పారు. వీరిని నెల్లూరులోని కూరగాయల మార్కెట్ సమీ పంలో మంగళవారం సాయంత్రం అరెస్టు చేశామని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బిట్రగుంట, మే 20(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని కొడవలూరు- పడుగుపాడు రైల్వే స్టేషన్ల మధ్య 184/28-30 కిలోమీటర్ల మధ్య (45)ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించి నట్లు కావలి జీఆర్పీ ఎస్‌ఐ రమాదేవి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. మృతుడు కాషాయం రంగు ఫుల్‌చొక్కా, పసుపు, మెరూన్ రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి పొట్టపై ఆపరేషన్ చేసిన మార్కు ఉంది. మృతదేహాన్ని కావలి ఏరియా ఆసు పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆమె తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 550

రూ. 19 లక్షల సీఎం సహాయ నిధి పంపిణీ

నెల్లూరు రూరల్, మే 20,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది అనారోగ్య బాధితుల కుటుంబాలకు రూ. 19 లక్షల ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అందచేశారు. మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పేద, నిరు పేద కుటుంబాలలో మెరుగైన వైద్యం చేయించుకోలేని వారికి సీఎం సహాయ నిధి ఎంత గానో దోహదపడు తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం సహాయనిధి త్వరగా అందుతోందని తెలిపారు.





అడుగు పెట్టలేం..!

నగరంలోని అపోలో ఆసుపత్రి కూడలి నుంచి జాతీయ రహదారి వైపు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ముత్తుకూరు రోడ్డు నుంచి హైవే వైపు వెళ్లే మార్గంలో రోడ్డంతా వర్షపునీరు నిలిచి బురద పేరుకుంది. ఇప్పటికే పలుమార్లు ఈ రోడ్డుకు మరమ్మతులు చేసినా తరచూ గుంతలు పడి వర్షపు నీరు నిలిచిపోయి అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. దీని వల్ల ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పరిహారం... పరిహాసం

- భవన నిర్మాణ కార్మికుల ఎదురుచూపులు
- నెలకు రూ.కోటి వరకు సెస్సు వసూళ్లు
- కానీ కార్మికులకు అందని వైనం
- గత ప్రభుత్వంలో రూ.1,60,59,000 పెండింగ్

నెల్లూరు (సాంస్కృతికం), మే 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం భవన నిర్మాణదారుల నుంచి సెస్సు రూపంలో భారీగా వసూలు చేస్తోంది. కానీ ప్రమాదాలు జరిగినప్పు డు కార్మికులకు మాత్రం పరిహారం అందడం లేదు. ఆరు సంవత్సరాలుగా పరిహారం కోసం కార్మికులు ఎదురుచూపులు చూస్తున్నారు. భవన నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు బిల్డర్లు, కాంట్రాక్టు నుంచి ఒక్క శాతం చొప్పున భవన నిర్మాణ సెస్సును వసూలు చేస్తోంది. ఆ విధంగా జిల్లాలో నెలకు రూ.కోటి చొప్పున గత ఆర్థిక సంవత్సరం రూ.13,32,86,443 వసూలు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమ ఫండ్ రూ.వేల కోట్లను దారి మళ్లించి భవన నిర్మాణ కార్మికులకు మొండిచేయి చూపించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని కార్మికులు భావించారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరి దాదాపు ఏడాది కాలం అవుతున్నా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకో వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిహారాన్ని ఇప్పటి వరకు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 1,21,372 మంది భవన నిర్మాణ కార్మికులు కార్మిక శాఖలో రిజిస్టర్ చేసుకున్నారు. వీరికి కార్మిక సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం కొంత నగదు అందజేస్తుంది. కాగా, 2019 ఏప్రిల్ 5 నుంచి జూన్ 2020 వరకు భవన నిర్మాణ కార్మికుల పిల్లల వివాహం, గిఫ్టు కోసం 24 మందికి రూ.3,20,000, ప్రసూతి బెనిఫిట్ కోసం 620 మందికి రూ.1,24,00,000, పాక్షిత అంగవైకల్యానికి గురైన భవన నిర్మాణ కార్మికులు 50 మందికి రూ.4,29,000, సహజ మరణం పొందిన 56 మంది కార్మికుల కుటుంబాలకు రూ.20,70,000, మరణించిన భవన నిర్మాణ కార్మి కులకు మట్టి ఖర్చు కింద 45 మంది కార్మికుల కుటుంబాలకు రూ.8,40,000 చెల్లించాల్సి ఉంది. ఈ విధంగా వైసీపీ పాలన సాగిన 2019- 2020 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 795 కార్మికులకు రూ.1,60,59,000 ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అలాగే 2020 నుంచి, ఈ సంవత్సరం ఏప్రిల్ 2025 వరకు భవన నిర్మాణ కార్మికుల వివాహ గిఫ్టు కోసం 25 మంది, ప్రసూతి బెనిఫిట్ కోసం 3631 మంది, భవన నిర్మాణంలో ప్రమాదాలు జరిగి పాక్షిక వికలాంగులైన 128 మంది, సహజ మరణం పొందిన 376 మంది, ప్రమాదంలో చనిపోయిన 9 మంది, చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు మట్టి ఖర్చుల కోసం 385 మంది కార్మిక శాఖకు దరఖాస్తు పెట్టుకుని పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. వీటన్నింటికీ నిధులు విడుదల చేసి, తక్షణ చెల్లింపులు చేయాలని ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.



ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం..

జిల్లాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధుల నుంచి పెండింగ్ బకాయిల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే దరఖాస్తు చేసుకున్న ప్రతీ భవన నిర్మాణ కార్మికుడికి పరిహారం చెల్లిస్తాం. ప్రధానమంత్రి ఈ- శ్రమ్ పథకం కింద జిల్లాలో 4,70,628 మంది అసంఘటిత కార్మికులు రిజిస్టర్ చేసుకున్నారు. ఈ పథకం కింద ప్రమాద పరిహారం ఇప్పటి వరకు నలుగురికి చెల్లించాం.

- కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు

నలుగురు కొత్త ఆర్ఐలకు పోస్టింగ్

నెల్లూరు(సిటీ), మే 20,(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో నలుగురికి ఆర్ఐలుగా పోస్టింగ్ ఇస్తూ కమిషనర్ వైవో నందన్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఎన్ఎంసీ కార్యాలయంలో హెచ్6 విభాగంలో పని చేస్తున్న ఎల్‌పీ వరప్రసాద్‌ను ఆర్ఐగా బదిలీ చేశారు. హెచ్1 విభాగంలో పని చేస్తున్న సీహెచ్ రవి, హౌసింగ్ ఫర్ ఆల్ విభాగంలోని సీవీఎస్ కిరణ్, ఎఫ్3లో పని చేస్తున్న పీ శీనయ్యను ఆర్ఐలుగా నియమించారు. ఆర్ఐలు వంశీనాథ్‌రెడ్డిని హెచ్1 సెక్షన్‌కు, సందీప్‌ను జీ4కు బదిలీ చేశారు. మరి కొందరికి కూడా కార్యాలయంలో విభాగాలు మార్చారు.



అవ్వా... అన్నం ఎలా ఉంది?

అవ్వా బాగున్నావా..? భోజనం ఎలా ఉంది...? కూరలు రుచిగా ఉన్నాయా..? అంటూ నెల్లూరు నగర కమిషనర్ వైవో నందన్ ఓ వృద్ధురాలిని ఆరా తీశారు. నగరంలోని ముత్తుకూరు గేటు సర్కిల్ వద్దనున్న అన్న క్యాంటీన్‌ను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న వృద్ధురాలితో ముచ్చటించారు. తనకు ఎవరూ లేరని, ప్రతీ రోజు ఇక్కడకు వచ్చి మూడు పూటల రూ.5 చెల్లించి కడుపు నింపుకుంటున్నానని ఆ ముదుసలి తెలిపింది. అన్న క్యాంటీన్ పెట్టిన చంద్రబాబు నూరేళ్లు చల్లంగ ఉండాలని దీవించింది.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు (వైద్యం), మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధిలో మంగళవారం సొసైటీ పాలక మండలి సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ తనమిత్రులతో కలిసి రక్తదానం చేశారు. వేసవి కాలంలో రక్తం కొరత ఎక్కువగా ఉంటుందని, డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందని ఆయన తెలియచేశారు. ఈ నేప థ్యంలో ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యాలయ కార్యదర్శి మస్తానయ్య, న్యాయవాదులు రంగరాజన్, నాగ శ్రీనివాస్, ఏడుకొండలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రాజేంద్రప్రసాద్ తదితరులు

కాలువల్లో పూడికతీతకు యంత్ర పాలన

- జెన్‌రోబోటిక్స్ యంత్రాన్ని పరిశీలించిన కమిషనర్

నెల్లూరు సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ కాలువల్లో పూడిక తీసి మురుగు వేగంగా ముందుకెళ్లేందుకు యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు కమిషనర్ నందన్ తెలిపారు. మంగళవారం రామ్మూర్తినగర్ వద్ద కాలువల్లో పూడిక తీసే జెన్‌రోబోటిక్ యంత్ర పనితీరును ఆయన పరిశీలించారు. పెద్ద, చిన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికను శుభ్రంగా తొలగించడంలో ఈ యంత్రం అద్భుతంగా పని చేస్తుందన్నారు. దీని వల్ల పని వేగంగా, శుల భంగా కూడా జరుగుతుందని చెప్పారు. ఈ యంత్రం బావుల్లోనూ పూడిక తీయగలదన్నారు. ముందుగా వనంతోపు, బీవీనగర్, కరెంటాఫీసు ప్రాంతా ల వద్ద పారిశుధ్య పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూలపేటలోని బాలికల ఉన్నత పాఠశాల, వీఆర్ హైస్కూల్ ప్రాంగణాలను పరిశీలించారు. దాతల సహకారంతో పాఠశాలలను ఆధునీకరించే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.



యంత్రం పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

కలెక్టర్ న్యాయం చేయాలి

నెల్లూరు (హరనాథపురం), మే 20 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణకు గురైన తమ భూమిని తిరిగి తమకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఇందుకూరుపేట మండలం కొరుటూరు గ్రామానికి చెందిన నక్కా గోపాలమ్మ కలెక్టర్‌ను కోరారు. మంగళవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. కొరుటూరు గ్రామంలో 7-5, 8-4, 8-8, 14-2 సర్వే నెంబర్లలో తనకు 1.60 సెంట్లు భూమి ఉందని తెలిపారు. ఈ భూమిని కొందరు ఆక్రమించుకోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశానని, అయినా ఫలితం కనిపించలేదన్నారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర దళిత సంఘ నాయకుడు బాలచెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణ కల్పించండి

నెల్లూరు (సాంస్కృతికం), మే 20 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఈదూరు కృష్ణయ్య, ఆయన కుటుంబం నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని కే కవిత అనే మహిళ పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడింది. ఈదూరు కృష్ణయ్య నెల్లూరులో పని చేస్తున్న సమయంలో తాను ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తుండేదాన్ని అని చెప్పారు. కృష్ణయ్య ప్రతిరోజూ తన పిల్లలను ఆ పాఠశాలకు తీసుకువస్తూ తనతో పరిచయం పెంచుకున్నాడని తెలిపింది. మాయమాటలతో తనతో సహజీవనం చేశాడని చెప్పింది. ఆ సమయంలో తనను శారీరకంగా, మానసికంగా హింసించాడని, తనను బెదిరించి బంగారం, రూ.35 లక్షలు నగదు కూడా తీసుకున్నాడని తెలిపింది. అతనికి దూరంగా వెళ్లి పోయినా నా అడ్రసు తెలుసుకుని వేధిస్తున్నాడని, అసభ్యకర ఫొటోలు, వీడియోలు యూట్యూబ్‌లో పోస్టు చేస్తున్నారని వాపోయింది. నెల్లూరు, తిరుపతి జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రక్షణ కల్పించాలని వేడుకుంది. ఈ సమావేశంలో న్యాయవాది ఎస్ మురళి, టీడీపీ నాయకులు చాట్ల శ్రీనివాసులు, టీ సురేంద్ర బాబు, కవిత కుమారుడు చంద్ర లోహిత్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు (వైద్యం), మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102 వాహనం)లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్ కుమార్ మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు నిర్వహిస్తున్న అరబిందో యాజమాన్యం ఏడేళ్లుగా ఉద్యోగులకు రూ.8800 మాత్రమే వేతనం చెల్లిస్తోందని ఆరోపించారు. పీఎఫ్ వాటాని కూడా ఉద్యోగుల జీతాల నుంచే మినహాయిస్తోందన్నారు. ఉద్యోగుల జీతాన్ని రూ.18500కు పెంచాలని డిమాండ్ చేశారు. యాజమాన్యమే పీఎఫ్ వాటాను చెల్లించాలని, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. వారాంతపు సెలవులు, పండుగలు, జాతీయ సెలవులను వర్తింపజేయాలని, బఫర్ సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

నేరాల నియంత్రణకు అవగాహన

- గ్రామాల్లో పోలీసుల సదస్సులు

నెల్లూరు(క్రైం), మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక శుక్తుల ఆట కట్టించేందుకు పోలీసులు సోమవారం రాత్రి గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యల్ని, నేరాలు, నివారణ చర్యలు, సైబర్ మోసాలు, గాంజా, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు, బాలికలపై జరిగే నేరాలు, ఇతర చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్నవారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నర్తకి సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు కే గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అభిమానులు కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం అన్నదానం చేశారు. ఈవో రాము, జీ మధు, రియాజ్, నిఖిల్, శ్రీధర్, జగన్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

ఉదయగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు నియోజకవర్గ నాయకులు బోగినేని కాశీరావు, కొట్టె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని జనసైనికులకు క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 4వేల మందికి సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సభ్యత్వాల నమోదులో జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గం మూడో స్థానంలో నిలిచిందన్నారు. క్రియాశీలక సభ్యత్వం ఉన్నవారికి రూ.5 లక్షల బీమా, రూ.50 వేలు ప్రమాద బీమా కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, బండారు సత్యనారాయణ, అలూరి రవీంద్ర, పెట్లు కిరణ్, నాయబ్‌రసూల్, రవికుమార్, కె శ్రీనివాసులు, రాఘవేంద్ర, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోమా నుంచి కాపాడిన వైద్యులు

నెల్లూరు (వైద్యం), మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహిం చారు. ఓ మహిళను కోమా దశ నుంచి కాపాడారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ గంగపట్నం దినేష్ మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గూడూరు మండలం చెంబర్తి గ్రామానికి చెందిన లక్ష్మి (50) ఉన్నట్లుండి కింద పడిపోయి కాలు, చేయి చచ్చుబడి కోమాలోకి వెళ్లిందన్నారు. ఆసుపత్రికి తీసుకురావడంతో పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి మెదడులో కణితి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. లోతైన బ్రెయిన్ స్టెమ్‌లో ఏర్పడ్డ కణితిని 5 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విజయవంతంగా తొలగించామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఈ శస్త్రచికిత్స చేశామన్నారు. బాధితురాలు పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 45.627 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి 45.627 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎడగారు పంటల సాగు నేపథ్యంలో పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

యోగా మహోత్సవ్‌లో మజ్జిగ పంపిణీ

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన మెగా యోగా మహోత్సవ్‌లో మజ్జిగ పంపిణీ జరిగింది. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు మజ్జిగ ప్యాకెట్లను, పౌష్టికాహారాన్ని అందజేశారు. మేఘన ఆటో ఫైనాన్స్ అధినేత జీ వెంకటరత్నం సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు తెలిపారు.





క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. సంఘం సభ్యుడు మారం రమణారెడ్డి కుటుంబ సభ్యురాలు అపర్ణ జ్ఞాపకార్థంగా క్రీడాకారులకు పౌష్టికాహారం అందించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, సభ్యులు చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, సుబ్బరాజు, స్వర్ణ రమేష్, రాజారమేష్, విజయమోహన్ నాయుడు, ఖలీల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హనుమజ్జయంతి

● పలు ఆలయాల్లో ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. బాలాజీనగర్ సీతారామ మందిరం ఆధ్వర్యం లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని మందిరం కమిటీ తెలిపింది. అధ్యక్షుడు తన్నీరు మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు అప్పల సత్యం, కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, త్యాగరాజస్వామి కళ్యాణ మండపం అధ్యక్షుడు అమరా మోహన్‌రావు మంగళవారం మందిరంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. గురువారం ఉదయం 6.30 గంటలకు పంచామృత అభిషేకాలు, 8.30 గంటలకు మన్యుసూక్త హోమం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి జరుగుతాయని చెప్పారు. 10గంటలకు ఆకుపూజ, సింధూర అర్చన, అన్నదానం, సాయంత్రం విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి ఒంటె వాహన సేవ జరుగుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

రాయాజీవీధిలో..

నగరంలో రాయాజీ వీధిలోని హనుమాన్ ఆలయంలో గురువారం హనుమజ్జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్తమండలి ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6గంటలకు గణపతిపూజ, 6.30గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 9గంటలకు ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో పూజ, 10గంటలకు మన్యుసూక్త హోమం, 12గంటలకు పూర్ణాహుతి, అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొంది. సాయంత్రం 6 గంటలకు చందనాలంకారం, 6.30 గంటలకు లలితా సహస్ర నామపూజ, పూలంగిసేవ, రాత్రి 7గంటలకు సీతారాములు కల్యాణం జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.



హనుమజ్జయంతి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

నేటి నుంచి ఉత్సవాలు

నగరంలోని మూలాపేట చెమ్మండివారి తోటలోని అభయాంజనేస్వామి ఆలయంలో బుధవారం నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు జరుగుతాయని భక్తుడు మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు ఈనెల 24వతేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

కనుల పండువగా పల్లకీసేవ

నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకీ సేవ కన్నుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకం, అర్చన, హోమం, నివేదన, హారతులు జరిగాయి. సాయంత్రం బ్యాండ్ కచేరీ, ప్రత్యేక అలంకార దర్శనం, హోమం, పల్లకీసేవ, హారతి జరిగాయి. భక్తులు భారీ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఏసీలు ఉన్నా.. చెట్టు నీడే చల్లన.. !

ఇంట్లో ఏసీ ఉన్నా.. ఊరి చివర వేపచెట్టు నీడే చల్లదనమని అనుకున్నారో.. ఏమో మండలంలోని సిద్దీపురం గ్రామంలో అనసూయనగర్‌కు వెళ్లే దారిలో ఉన్న వేపచెట్టు అరుగు వద్ద గ్రామస్థులు సేద తీరుతున్నారు. చేలల్లో పంటలు లేకపోవడంతో వేపచెట్టు కింద కబుర్లు చెప్పుకుంటూ ఎండల గ్రామస్థులు ఉపశమనం పొందుతున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

మాదక ద్రవ్యాల అనర్థాలను వివరించాలి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 20 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలను యువతకు అర్థమయ్యేలా వివరించాలని, ఇందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో నషా ముక్త భారత్ అభియాన్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గంజాయి, పొగాకు, గుట్కా, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం వల్ల కలిగే దుష్ప్రరిణామాలు, చట్టపరంగా అమలవుతున్న శిక్షలపై జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో, జనసంచారం కలిగిన ప్రదేశాలల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రించాలన్నారు. కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ మహ్మద్ అయూబ్, సూపరింటెం డెంట్ సంధ్యారాణి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆర్ఐవో వరప్రసాద్, బాలల సంరక్షణ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పడుగుపాడు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కోవూరు, మే 20(ఆంధ్రజ్యోతి): పడుగుపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి వీ హజరత్‌బాబును సస్పెండ్ చేస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల్ని తుంగలోతొక్కి రూ.25,51,910 మేరకు అవక తవకలకు పాల్పడినట్లు నిర్ధారించి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. పడుగుపాడు పంచాయతీ పరిధి నుంచి హజరత్‌బాబు తమ అనుమతి లేకుండా వెళ్లకూడదని సూచించారు. సస్పెన్షన్ ఉత్తర్వులు జిల్లా పంచాయతీ అధికారి ద్వారా కార్యదర్శికి అందడంతో జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో ప్రకంపనలు ప్రారంభమయ్యాయి.

చంద్రబాబుకు రేషన్ డీలర్ల పాలభిషేకం

● దుకాణాల ద్వారా సరుకుల పంపిణీపై హర్షం

నెల్లూరు (హరనాథపురం), మే 20 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకులను జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయిస్తామని పౌరసరఫ రాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించ డంపై జిల్లాలోని రేషన్ డీలర్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి మనోహర్ ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు జిల్లా యునైటెడ్ చౌక ధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన రమేష్, ఉపాధ్యక్షుడు పాబోలు వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి, మీడియా ఇన్‌చార్జి ఎం రమేష్, సంయుక్త కార్యదర్శి కే సురేష్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.



చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభిషేకం చేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

బురద రోడ్డుపై ప్రయాణించేదెలా?

కలిగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): ఎండైనా, వానైనా ఆ రోడ్డుపై ప్రయాణించడమంటే నరకప్రాయమే. చినుకు పడితే చిత్తడిగా మారి అడుగుతీసి అడుగు వేయాలన్నా భయం. ఎండ కాస్తే దుమ్ము కొట్టుకు పోవాల్సిందే. ఈ పరిస్థితి ఒకరోజో.. రెండు రోజులో కాదు దశాబ్దాల తరబడి ఆ గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులు. ఇంతకీ ఆ గ్రామం ఎక్కడో మారుమూల అనుకుంటే పొరపాటే. మండల కేంద్రమైన కలిగిరికి ఏడు కిలోమీటర్లు.. కలిగిరి-కొండాపురం ప్రధాన రహదారి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రారెడ్డిపాలెం. గ్రామంలోకి వెళ్లాలంటే నేటికీ మట్టిరోడ్డుపై నడవాల్సిందే. గ్రామం ముంగిట నుంచి కృష్ణారెడ్డిపాలెం పంచాయతీ మీదుగా రాజుపాలెం వరకు తారు రోడ్డు ఉన్నా చంద్రారెడ్డిపాలెంకి కనీసం గ్రావెల్‌రోడ్డు వేసిన దాఖలాలు లేవు. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే గ్రామంలోకి వెళ్లే రహదారి బురదమయంగా మారిపోతుంది. ఆ బురద రోడ్డులో ఉన్న గుంతల్లో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గాన గ్రామ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా మహిళలు, వృద్ధులు, చిన్నారులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అలాగే గ్రామంలోని రైతులు తమ పశువులకు పచ్చిమేత తెచ్చుకోవాలంటే ఈ మార్గం గుండా నిత్యం ద్విచక్ర వాహనంపై వెళ్లాల్సి ఉంటుంది. వర్షం వస్తే చాలు ద్విచక్ర వాహనాలకు రోడ్డుపై మట్టి అంటుకొని, చక్రాల నిండా బురద పేరుకుపోయి రహదారి మధ్యలోనే కదలలేని స్థితికి మారిపోతాయి. నాలుగుచక్రాల వాహనాలు వెళ్లాలంటే రోడ్డుపై నుంచి జారి అదుపు తప్పి పక్కన కాలువల్లోకి వెళ్లే పరిస్థితి. దీంతో వాహనదారులు హడలి పోతున్నారు. ఈ పరిస్థితిలో ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చే నేతలకు ఈ రోడ్డు గురించి మొరపెట్టుకోవడం.. వాళ్లు హామీలు ఇవ్వడం తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఈ క్రమంలో గత ఎన్నికల సమయంలోనే కాకుండా ఇటీవల ఎమ్మెల్యేగా ఈ గ్రామానికి వచ్చిన కాకర్ల సురేష్‌కు మహిళలు రోడ్డు దుస్థితిని వివరించారు. దీంతో త్వరితగతిన రోడ్డు నిర్మించి ఇబ్బందులు తొలగిస్తామన్న ఆయన ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.



చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారిన చంద్రారెడ్డిపాలెం మట్టిరోడ్డు

కేంద్రం నియంత్రణలోకి ఉపాధి

● ఇక యుక్తధార యాప్ పూర్తిస్థాయి అమలులోకి
● ప్రతి పనిని నమోదు చేయాలని ఆదేశాలు
● పనులు, చెల్లింపులు అన్నీ ఇక ఢిల్లీ నుంచే..

సంగం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో ఉపాధి హామీ పథకం పనులు సాగాయి. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం అన్ని స్థాయిలోనూ తమ ఆధీనంలో ఉండేలా చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఇక నామమాత్రంగానే ఉండబోతున్నదని ఈ పథకాన్ని అమలు చేస్తున్న నీటి యాజమాన్య సంస్థ అధికారులు స్పష్టం చేశారు.

● యాప్ రూపకల్పన

ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకునేందుకు కేంద్రం యుక్తధార అనే యాప్‌ను రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించేందుకు 2005లో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసింది. ఏపీవో, ఎంపీడీవోలు పర్యవేక్షించేవారు. పనుల కల్పన, బిల్లుల చెల్లింపులన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనసాగేవి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన యుక్తధార యాప్ ద్వారా ఇప్పటి వరకు ఈ పథకంలో జరుగుతున్న ప్రాసెస్ కనుమరుగయ్యే అవకాశముంది.

● యాప్ అమలు ఇలా...

ఎక్కడ ఎలాంటి పనులు జరుగుతున్నాయి.. ఏ ప్రాంతంలో ఏ పని ఎప్పుడు చేయాలి. అంచనాల రూపకల్పన ఎలా.. ? బిల్లుల చెల్లింపులు తదితర అంశాలన్నింటినీ యుక్తధార యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చొని కేంద్రం ప్రభుత్వ అధికారులు నిర్ణయించనున్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన లేబర్ బడ్జెట్ ఆమోదం తెలుపుతుంది. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తిస్తుంది. వారికి నగదును నేరుగా కేంద్రమే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. ఇప్పటికే అమలులో ఉన్న యుక్తధార యాప్ ఇక పూర్తిస్థాయిలో వినియోగంలో తీసుకువచ్చి కేంద్రమే పూర్తిస్థాయిలో పర్యవేక్షించనున్నది. దీని వల్ల కూలీలకు బిల్లుల జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు జమయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సోమశిల దక్షిణ కాలువకు నీరు విడుదల

కలువాయి, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ పూర్తి ఆయకట్టు 35వేల ఎకరాలకు రెండో పంటకు సాగునీరు విడుదల చేయడం జలాశయం చరిత్రలో ఇదే తొలిసారి అని సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవచౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సోమశిల అధికారులతో కలిసి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కలువాయి చెరువు నుంచి దక్షిణ కాలువకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సక్రమంగా నీరందించేందుకు సాగునీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు కలసి పనిచేయాలని ఆయన కోరారు. వైసీపీ ప్రభుత్వంలో కాలువల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారని, కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిపి వారి ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తోందన్నారు. ఐఏబీ తీర్మానం మేరకు సోమశిల ద్వారా 3.46 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే కండలేరు ద్వారా మరో 1.65 ఎకరాలకు మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 5లక్షల ఎకరాలకు సాగునీరు రెండో పంటకు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. ఈఈ మల్లికార్జున మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలోని రైతులు రెండో పంటగా ఆరుతడి పంటలు వేసుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కాలువ కమిటీ వైస్ ప్రెసిడెంట్ చల్లా విజయభాస్కర్‌రెడ్డి, నీటి సంఘాల ప్రతినిధులు మల్లు విజయకుమార్‌రెడ్డి, ఉడతా హజరత్తయ్య, రావి ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, బీజేపీ నాయకుడు దండు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



కలువాయి చెరువు నుంచి నీరు విడుదల చేస్తున్న సోమశిల అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు

నాడి పడితే ఒట్టు !

● అంతా రెఫరలే.. ● వేధిస్తున్న వైద్యుల కొరత
● వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు పరుగు
● ప్రజలపై అదనపు భారం
● ఇదీ.. ఉదయగిరి సీహెచ్‌సీ పరిస్థితి

ఉదయగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): రూ. కోట్లు వెచ్చించి భవనం నిర్మించారు. అందంగా ఉండేందుకు రంగులు కూడా వేశారు. అందులో 50 పడకలు ఏర్పాటు చేశారు. కానీ.. పేదవాడి నాడీ పట్టి చూసే వైద్యులను మాత్రం నియమించలేదు. దీంతో రూ. లక్షలాది విలువయిన పరికరాలు నిరుపయోగంగా మారాయి. అరకొరగా ఉన్న వైద్యులపై పని భారం పడడంతోపాటు వైద్యశాలకు వచ్చే రోగులను రెఫర్ అంటూ చేతులు దులుపుకుంటున్నారు.

ఉదయగిరి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు



ఇదీ ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) పరిస్థితి.

● రోగుల తాకిడి అధికం

ఉదయగిరి సీహెచ్‌సీకి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ వైద్యశాలకు ప్రతిరోజూ 200 నుంచి 250 మంది రోగులు వస్తుంటారు. అయినా మెరుగైన వైద్యం అందడంలేదు. విధి నిర్వహణలో ఏ డాక్టర్ ఉన్నా వచ్చినా రోగిని చేయి కూడా పట్టుకోకుండా రుగ్మత తెలుసుకుని మందులు రాసిస్తున్నారు. దీనికితోడు రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో వైద్యశాలలకు వచ్చిన క్షతగాత్రులకు నామమాత్రంగా చికిత్స అందించి రెఫర్ అంటూ ఆత్మకూరు, నెల్లూరు, కావలి వైద్యశాలలకు పంపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ వైద్యంపై ప్రజలను నమ్మకం సన్నగిల్లింది. ఈ క్రమంలో అప్పులు చేసి మరీ ప్రైవేటు వైద్యశాలలకు వెళుతున్నారు.

● వేధిస్తున్న వైద్యుల కొరత

50 పడకల ఈ వైద్యశాలలో సుమారు 12 మంది వైద్యులు ఉండాల్సి ఉంది. అయితే ఐదుగురు వైద్యులు ఉండగా, ఒకరు లీవ్‌లో ఉన్నారు. ఉన్న నలుగురిపై పని భారం పడడంతో వారు తూతూమంత్రంగా వైద్యసేవలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా చిన్న పిల్లల డాక్టరు, గైనకాలజిస్టు, జనరల్ మెడిషన్, సర్జన్, ఈఎన్‌టీ, ఫిజియోథెరపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాత్రి సమయాల్లో వైద్యసేవలు అందడం గగనంగా మారింది.



ఫిజియోథెరపిస్టు లేక మూలకు చేరిన సామగ్రి

నిరుపయోగంగా పరికరాలు

కొన్నేళ్ల క్రితం రూ.5 లక్షలు వెచ్చించి చిన్నారుల సంరక్షణ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి నుంచి వైద్యుడిని నియమించక పోవడంతో రూ.లక్షల విలువైన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. చిన్నారులకు ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తున్నది. రెండేళ్లుగా ఫిజియోథెరపిస్టు పోస్టు ఖాళీగా ఉండడంతో పరికరాలు వైద్యశాలలో మూలకు చేరాయి. అలాగే శస్త్రచికిత్స పరికరాలు, వెంటిలేటర్లు కూడా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు చేపట్టి వైద్యశాలలో వైద్యుల నియామకం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు సఫలం

● డీఈవో కార్యాలయం ముట్టడి వాయిదా

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జరిపిన చర్చలు సఫలమయ్యాయని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకుడు ఏ సురేంద్రరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, రీఅపోర్ష్‌మెంట్, ఇతర సమస్యలకు సంబంధించి ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులతో ఉపాధ్యాయ సంఘాలు భేటీ అయ్యాయని తెలిపారు. తమ డిమాండ్లకు ఉన్నతాధికారులు ఆమోదం తెలియచేయడంతో బుధవారం తలపెట్టిన డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు.

టెన్త్ సప్లిమెంటరీకి 251 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మంగళవారం హిందీ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షకు 328 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 77 మంది మాత్రమే హాజరయ్యారు. 251 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్‌స్కూల్ టెన్త్ పరీక్షలకు 137 మంది హాజరు కావాల్సి ఉండగా 90 మంది హాజరుకాగా 47 మంది గైర్హాజరయ్యారు. డీఈవో బాలాజీరావు 6 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 22 కేంద్రాలు కలిపి మొత్తం 28 కేంద్రాలను పరిశీలించారు.

ఏపీ ఐసెట్ ఫలితాల విడుదల

● 1,634 మందికి అర్హత

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షకు జిల్లా నుంచి 1861 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1726 మంది హాజరయ్యారు. వారిలో 1634 మంది అర్హత సాధించినట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. వీరిలో పురుషులు 725 మంది, మహిళలు 909 మంది ఉన్నారని తెలిపారు.

పాముకాటుకు గిరిజన యువకుడి మృతి

● మూఢనమ్మకానికి నిండు ప్రాణం బలి

ఉలవపాడు, మే 20(ఆంధ్రజ్యోతి) : మంత్రాలకు, తంత్రాలకు పాముకాటు నయమవుతుందన్న భ్రమలో కళ్లముందే నిండు ప్రాణం గాలిలో కలిసి పోయిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. మృతుడి బంధువులు కథనం మేరకు.. ఉలవపాడు పంచాయతీ పరిధిలోని కే రాజుపాలెం యానాది కాలనీకి చెందిన మానికల పోలయ్య (26) తన భార్యతో కలిసి ఉలవపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ మామిడి తోటలో రెండు రోజుల క్రితం కాపలాకు చేరాడు. మంగళవారం ఉదయం వర్షం పడుతుండటంతో పందిరి వేసుకొని వర్షం పడకుండా దానిపై పట్ట కప్పుకునేందుకు తోట కంచె వద్ద కర్రలు కొడుతుండగా కాలుపై ఏదో కుట్టినట్లు అనిపించింది. దానిని పరిశీలించగా తన కాళ్ల వద్ద నుంచి పాము పొదల్లోకి వెళుతూ కనిపించింది. దీంతో తన భార్యతో చెప్పి ఇద్దరు కలిసి తెట్టుకు వెళ్లి పాము కాటుకు మంత్రం వేయించారు. అప్పటికే సమయం గడిచిపోవ డంతో పరి స్థితి విషమంగా మారిందని గమనించి తెట్టు నుంచి ఆటోలో కావలి ప్రభుత్వ ఆసుపత్రికి పోలయ్యను తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు పరీక్షించిన వైద్యులు నిర్ధారించారు. పోలయ్యను పాముకాటు వేసిన తోట హైవే పక్కన ఉండటం, దీనికి తోడు అరకిలోమీటరు దూరంలో ఉలవపాడు సీహెచ్‌సీ ఉంది. పాము, తేలు కాటుకు విరుగుడు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ అమాయక గిరిజనులు మూఢనమ్మకంతో మంత్రం వేస్తే తగ్గిపోతుందని చివరికి నిండు ప్రాణం బలి చేసుకున్నారు. మృతుడు పోలయ్య భార్య నాగమణి మూడు నెలల గర్భవతి కాగా, 3 ఏళ్ల బాలుడు ఉన్నాడు.



పోలయ్య మృతదేహం

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266
కోడిగుడ్ల ధర (100): 550	



ఆంధ్రకేసరికి ఘన నివాళి

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు ఆయనకు ఘన నివాళులర్పించారు. కోవూరు రోడ్డులోని హరిణి ఆసుపత్రి వద్ద ఉన్న ఆంధ్రకేసరి కాంశ్యవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందనవనం రామసుబ్బారావు, డాక్టరు తన్నీరు మల్లికార్జునరావు, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, పెట్లూరి సుబ్బారావు, చక్కా వెంకటకేశవరావు, కేవీఎస్ వెంకటేశ్వర్లు, ఆర్వీ బ్రహ్మానందం, ఏవీ రావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రత్యేక ఆధార్ కేంద్రం పరిశీలన



సిరిపురంలో గిరిజన మహిళకు ఆధార్ కార్డు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో గిరిజనుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీ కుటుంబాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న మోటారుసైకిల్ అదుపు తప్పి పడిపోవటంతో చిరుమామిళ్ల రవికుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట సమీపంలో మంగళవారం జరిగింది. గుడ్లూరు మండలం దారకానిపాడుకు చెందిన రవికుమార్ పొన్నలూరు వైపు నుంచి కందుకూరుకు మోటారుసైకిల్‌పై వేగంగా వస్తూ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలవడంతో రవికుమార్ అపస్మారక స్థితికి చేరాడు. క్షతగాత్రుడిని 108లో స్థానిక వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఒంగోలులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు.

24న లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి వచ్చే అధికారులు అజెండాలోని అంశాలపై పూర్తి సమాచారంతో ఉండాలని తెలిపారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కావలిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో 2024-25 విద్యా సంవత్సరంలో 470కి పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఎపా)ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు ఎపా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బూచి ముధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు కందుకూరు డివిజన్‌కు చెందిన అర్హులైన యాదవ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు 9492007309, 9490662651కు సంప్రదించాలని మార్కుల జాబితా వాట్సాప్ చేయాలని పేర్కొన్నారు. జూన్ 1వ తేది ఉదయం 8గంటలనుంచి గొలగమూడి రోడ్డు కొండాయపాలెం వద్ద నున్న యాదవ్ భవన్‌లో పురస్కారాలు అందిస్తారని తెలిపారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

కొండాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు మండలంలోని కొమ్మిలో మంగళవారం అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ టీడీపీ యువ నాయకుడు అంబటి సురేంద్ర ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యువత బీ.రవి, అంబటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఆయన అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు రక్తదానం చేశారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

లింగసముద్రం, మే 20(ఆంధ్రజ్యోతి) : ఈనెల 22న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని లింగసముద్రం పంచాయతీ బలిజపాలెంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి అందమైన రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేశారు. అదేరోజు ఉదయం 9 గంటలకు స్వామి వారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ జయంతి ఉత్సవానికి భక్తులు భారీగా హాజరై శోభాయాత్ర కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

నాణ్యతకు తిలోదకాలు!

● రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ ● వర్షం వస్తే ప్రయాణికులకు వసతి కరువు

కావలి, మే 20(ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో గతంలో ఏ నిర్మాణ పనులు చేపట్టినా నాణ్యతకు మారు పేరుగా ఉండేది. పేరొందిన కాంట్రాక్టర్ల పనులు చేపట్టేవారు. అలాంటిది ఇప్పుడు రైల్వే శాఖలో పనులు నాణ్యత లోపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా పెద్దగా ఉండడంలేదనేందుకు నాణ్యతలేని పనులే నిదర్శనంగా మారాయి. కావలి రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా పలు నిర్మాణ పనులు చేపట్టినా వాటిలో నాణ్యతలో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. రెండు రోజులుగా కురిసిన చిన్నపాటి వర్షాలకు రైల్వే స్టేషన్‌లో మొత్తం నీరు చేరి, రేకులు ఉరుస్తుండడంతో ప్రయాణికులు నిలవడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా 4వ నెంబరు ప్లాట్‌ఫారంపై ఉన్న షెడ్లు వర్షపు నీరు చుక్క పక్కకు పోకుండా షెడ్లు దోనెలో నుంచి ప్రయాణికులు కూర్చునే బల్లలపై వర్షపునీటి దారలు పడుతున్నాయి. సహజంగా ఎక్కడైనా ఒక చోట ఎదైనా ఇబ్బందుల వలన వర్షపు నీరు పడటం సహజం. కానీ రైల్వేస్టేషన్‌లో షెడ్లు కింద వేసి ఉన్న అన్ని బల్లలపై వర్షపు నీరు పడుతున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆ షెడ్లు ఎండలకు తప్ప వర్షాలకు పనికి రానట్లుగా తయారయ్యాయి. అలాగే 1వ నంబరు ప్లాట్‌ఫారంపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడతున్నారు. అదే ప్లాట్‌ఫారంపై నిర్మించిన మంచినీటి కొళాయి చుట్టూ నీరు నిలిచి అక్కడ పాచి పట్టి దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు.



రైల్వేస్టేషన్‌లో బల్లలపై పడుతున్న వర్షపునీరు



కుళాయి వద్ద నీరు నిల్వతో పట్టిన పాచి

అలా గే ఫుట్‌పాత్ మెట్లలో పడిన వర్షపు నీరు వెళ్లేందుకు తగిన వాలు లేక పోవటంతో మెట్లపై వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందికరంగా మారి ఎక్క డ ప్రమాదాల జరుగుతాయోనని ఆందోళన చెందుతన్నారు. అలాగే 1వ నంబరుప్లాట్‌ఫారంలో అక్కడ క్కడ పెద్ద పెద్ద రంధ్రాలు పడటంతో వాటిలో కాళ్లు తట్టుకుని ఎక్కడ పడతామోనని ప్రయాణికుల భయపడుతున్నారు. స్టేషన్ ముందు భాగాన ఉన్న ప్రదేశంలో కూడా వర్షపు నీరు పోయేందుకు తగిన వాటంలేకుండా ఉండటంతో నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్టేషన్‌కు వచ్చే మార్గంలో మధ్యలో ఒక గుంట పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించు కోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. అసలు నిర్మాణ పనులలో నాణ్యతకు పూర్తిగా తిలోదకాలు ఇవ్వటమే కాక నిర్వహణ పట్ల కూడా నిర్లక్ష్యంగా వ్యహరిస్తుండటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి స్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి చర్యల చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాగునీటి సరఫరా, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

● సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో, బోగోలు

బిట్రగుంట, మే 20(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని 16 పంచాయతీల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా రక్షిత మంచినీరు సరపరా చేయించడంతో పాటు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయించాం. అలాగే గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునఃప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు.



? వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు.

! మండలంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేదు. ఒకవేళ ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణ చర్యలు తీసుకుని నీటి సరపరా చేస్తాం. అలాగే పంచాయతీ కార్యాలయం, బస్టాండు, ప్రధాన కూడళ్లలో అధికారులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల దారా చలివేంద్రాలు ఏర్పాటు చేశాం.

? వేసవిలో మూగజీవాల దాహర్తిని తీర్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు.

! అన్ని గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేసి నీటిని నిల్వ ఉండేలా చూడాలని పశువైద్యాధికాలు, సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు నిల్వ ఉండటం వలన ఎలాంటి ఇబ్బందులు లేవు.

? మండలంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

! స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి మూడవ శనివారం ప్రజలను చైతన్య పరుస్తూ ప్రత్యేక కార్యక్రమం చేస్తున్నాం. గ్రామల పరిశుభ్రత, వేసవి నుంచి ఉపశమనం పొందడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం కార్యాలయాల్లో కూల్ సున్నం వేయిస్తున్నాం. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరిస్తున్నాం.

ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ తీగలు



చేతికి తగులుతున్న విద్యుత్ తీగలు

ఉలవపా డు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మనిషి చెయ్యి ఎత్తితే తగిలేంత ఎత్తులో 11 కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. వీటితో ప్రమాదం పొంచి ఉందని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని ఆక్వా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలో సుమారు 150 రొయ్య లు చెరువులు సాగులో ఉన్నాయి. కరేడు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఇండస్ట్రీ ఫీడర్ 11 కేవీ హై ఓల్టేజ్ విద్యుత్ సరఫరా అక్వా రైతులకు కేటాయించారు. అయితే విద్యుత్ సరఫరా తీగలు సాగిపోయి కిందకు వేలాడుతు మనిషి చెయ్యి ఎత్తితే తగిలే అంత ఎత్తులో ఉండటంతో చెరువుల వద్ద రాత్రులు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికి రెండుసార్లు విద్యుత్ తీగలు తెగిపడినా సంబంధిత అధికారులు జాయింట్‌లు వేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు తప్ప హై ఓల్టేజీ తీగలు కిందకు వేలాడడాన్ని మాత్రం సరిచేయలేదు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆక్వా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని 11కేవీ విద్యుత్ తీగల నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

● కార్మికుల నిరసన ర్యాలీ

కావలిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తక్షణం నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను కష్టాలపాలు చేసే కుట్ర పన్నిందన్నారు. ఇటువంటి దుర్మార్గపు లేబర్ కోడ్‌ల వలన కార్మికుల తమ హక్కుల సాధన కోసం సమ్మె చేసుకునేందుకు అవకాశం హక్కు కోల్పోతారని ఆవేదన చెందారు. కార్మికులు యూనియన్ పెట్టుకునే హక్కు, ఉద్యోగ భద్రత తదితర ప్రధాన హక్కులు కాలరాస్తుందని కనీస వేతన చట్టం రూ.26000 అమలు కాదని, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయరని, తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేయించుకునే ప్రమాదముందన్నారు. ఇప్పటికే అనేక రకాల ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేట్‌పరం చేయడంతోపాటు కార్మికుల పనిభారం పెంచి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు పసుపులేటి పెంచలయ్య, మల్లి అంకయ్య, ఏఐఎఫ్‌టీయు న్యూ నాయకులు లక్ష్మారెడ్డి, కార్మిక నాయకులు శ్యామలమ్మ, కృష్ణమోహన్, దర్గా బాబు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



ట్రంకురోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న వివిధ రంగాల కార్మికులు

సీఐటీయూ నిరసన

కందుకూరు : కేంద్రప్రభుత్వం విధించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కందుకూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని అంకమ్మ దేవాలయం వద్ద నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు వివిధ రంగాల కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసి 4 లేబర్‌కోడ్‌లను విధించటం ద్వారా కేంద్రప్రభుత్వం కార్మికులను వీధుల పాలు చేసిందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోకపోతే జూలై 9న దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికుల సమ్మెతో నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఏ గౌస్, జీవీబీ కుమార్, కొట్టె వెంకయ్య, ఎస్‌డీ గౌస్, గుత్తి మల్లిఖార్జున, సుంకర విజయలక్ష్మి, సీహెచ్ ఇందిరావతి, ప్రభావతి, పవన్‌కుమార్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పోలేరమ్మ

బిట్రగుంట, మే 20(ఆంధ్ర జ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ చెంచులక్ష్మీపురంలో వెలసి ఉన్న పోలేరమ్మ పొంగళ్లు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం రాత్రి ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం తెల్లవారు జామున పోలేరమ్మకు అభిషేకాలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కాయాకర్పూర హారతులు ఇచ్చి సేవించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ, పూలంగిసేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మునగాల జనార్దన్‌రెడ్డి, కడియాల వెంకయ్య, పసుపులేటి సుబ్బారావు, గుంజి వెంకటేశ్వర్లు, షేక్.బాబు, పసుపులేటి రఘు, తదితరులు పాల్గొన్నారు.

మందాటి చెరువు అభివృద్ధికి చర్యలు

● అధికారులతో కలసి ఎమ్మెల్యే పరిశీలన



మందాటి చెరువు అభివృద్ధి ప్రణాళికను ఎమ్మెల్యేకు వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈ


కావలి, మే 20(ఆంధ్రజ్యోతి) : కావలి మందాటి చెరువు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, దీంతో చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, లైటింగ్, గ్రీనరీ, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాంతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మందాటి చెరువును త్వరలో సుందరంగా తీర్చిదిద్ది ఒక పర్యాటకంలా దాని రూపు రేఖలు తీసుకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన కావలి ఎమ్మెస్సార్ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను మంగళవారం కావలి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ మేళాలో సుమారు 23 కంపెనీలు పాల్గొని 1200 మందిని ఎంపిక చేస్తారన్నారు. ఈమేళాలో 10, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, పాలిటెక్నిక్, బీ ఫార్మసీ చేసిన నియోజకవర్గంలోని యువత పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌చార్జి ఖయామ్, తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు కొత్త స్పిల్‌వే

స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటు జరిగేనా?



రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెలు

లింగసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులోని కొత్త స్పిల్‌వేలో రేడియల్ గేట్ల ముందు భాగంలో అధికారులు స్టాప్‌లాక్ గేట్లను ఏర్పాటును విస్మరించారు. ఈ స్పిల్‌వేలోని రేడియల్ గేట్లు ప్రాజెక్టులో నీరు ఉన్న సమయంలో మరమ్మతులకు గురైన సమయంలో గేట్ల వద్దకు నీరు రాకుండా నిలిపి వేసి గేట్లను బాగు చేసేందుకు ఈ స్టాప్‌లాక్ గేట్లను నిర్మిస్తారు. రాళ్లపాడు ప్రాజెక్టుకు 1994, 96 సంవత్సరాలలో రెండుసార్లు ఒకే చోట గండ్లు పడినప్పుడు అధికారులు ఇక్కడ 5 రేడియల్ గేట్లతో కొత్త స్పిల్‌వేను నిర్మించారు. అయితే ఈ స్పిల్‌వేను నిర్మించేటప్పుడు స్టాప్‌లాక్ గేట్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు దిమ్మెలను నిర్మించారు. ఇవి నిర్మించి దాదాపు 25 ఏళ్లు గడిచినప్పటికీ అధికారులు ఈ స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటును పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భారత సైన్యానికి సెల్యూట్

అల్లూరు, మే 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిన భారత సైన్యం, వాయుసేన, నావికాదళం సత్తా చాటిన సందర్భంగా వారికి మద్దతుగా అల్లూరులో మంగళవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, హిందూ చైతన్యవేదిక, హిందూ ప్రచార పరిషత్, విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, హిందూ సంఘాలు, మిత్రసంఘాలు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో అల్లూరు ఇస్కపల్లి రోడ్డు నుంచి కోనేటి సెంటరు వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత సేన చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమవడానికి కృషి చేసిన ప్రతి జవానుకి సెల్యూట్ అంటూ నినాదాలు చేశారు.



అల్లూరులో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న నేతలు

ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపు

కొండాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు ఆధార్‌కార్డులేని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంపై మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ సామాజిక వర్గంలో ఆధార్‌కార్డులు లేనివారితోపాటు కార్డు పోగొట్టుకున్నవారికి తిరిగి మంజూరు చేసేందుకు ఈనెల 30వ తేదీ నుంచి జూలై 6 వరకు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. 6 ఏళ్ల లోపు వారికి కచ్చితంగా పుట్టినతేది సర్టిఫికెట్లు ఉండాలని, 6 ఏళ్ల పైబడిన వారికి పంచాయతీ కార్యాలయంలో పుట్టినతేది సర్టిఫికెట్లు ఇచ్చేందుకు మార్గదర్శకాలను ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంపై ఎస్టీ కాలనీవాసులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, ఈవోపీఆర్‌డీ నారాయణరావు, సీడీపీవో పద్మజ, ఐటీడీఏ ఏపీఐవో మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణ

పురిణి చెరువు ఆక్రమణలను పరిశీలించిన ఆర్డీవో

అల్లూరు, మే 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పురిణి ఎల్‌పీఎం 1391లో 500 ఎకరాల చెరువు భూమిని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ మంగళవారం పరిశీలించారు. చెరువు ఆక్రమించుకొని భూములుగా మార్చి పంటలు పండించుకోవడంతో ఆ చెరువు ఆయకట్టు పరిధిలోని గోగులపల్లికి చెందిన రైతులు నీరు సరిగా సరఫరా కాకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కారణంగా కొంతమేర ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలను తొలగించారు. తాము పేద రైతులమని తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ ఆక్రమిత రైతులు సోమవారం అర్జీలు అందజేశారు. దీంతో ఆయన సదరు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమిత రైతులు, ఆయకట్టు రైతులతో మాట్లాడారు. పరిస్థితిని ఇరువర్గాలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సబ్‌ట్రెజరీ అధికారి ఉస్మాన్‌కు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి రామిరెడ్డి, జాఫర్‌అహ్మద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిద్దెపైన కార్యాలయం ఉండడంతో పలువురు విశ్రాంత ఉద్యోగులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కార్యాలయం కింద ఓ ఉద్యోగిని ఏర్పాటుచేసి సమస్యలు అక్కడే పరిష్కరించాలని కోరారు. కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9026
వెండి కిలో ధర	రూ. 98,100
వెండి ఒక గ్రాము	రూ. 101.10

ఫారంపాండ్స్‌తో రైతులకు మేలు

● డీ. సుబ్బారాయుడు, ఏపీవో



అనంతసాగరం మే 20 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనం మేరకు ప్రభుత్వం ఫారం పాండ్స్ మంజూరుకు చర్యలు చేపట్టినట్లు ఉపాధిహామీ ఏపీవో డీ సుబ్బారాయుడు తెలిపారు. రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

? అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయా.. సగటు కూలీ ఎంత.

! మండలంలోని పంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించాం. సగటు కూలీ రూ. 260 నుంచి రూ. 280 ఉంది.

? ఇంకుడుగుంటలకు మార్గదర్శకాలు వచ్చాయా..

! వ్యక్తిగత, కమ్యూనిటీ ఇంకుడు గుంటల నిర్మాణాలకు ఆదేశాలు వచ్చాయి. నిర్మించుకునే వారికి నిధులు చెల్లించడం జరుగుతుంది.

? ఫారంపాండ్స్ ఎన్ని మంజూరయ్యాయి.

! మండలానికి 200 కుంటలు మంజూరయ్యాయి. కావల్సిన రైతులు సిబ్బందిని సంప్రదించాలి.

న్యూస్ బాక్స్

హనుమజ్జయంతి వేడుకలు ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణలో ఆంజనేయస్వామి ఆలయం

సంగం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి పూలంగిసేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా బుధవారం అభిషేకాలు, పూలంగిసేవ, ప్రత్యేక పూజలు, 22న పూలంగిసేవ, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● దుత్తలూరు (ఉదయగిరి) : మండలంలోని వెంకటంపేట గ్రామంలో ఉన్న వీరాంజనేయస్వామి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు గణపతి, కలశ, సహస్రనామ, కర్పూర హారతి తదితర పూజా కార్యక్రమాలు, గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి, శుక్రవారం సహస్రనామ, కర్పూర హారతి, నైవేద్యం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు అన్నప్రసాదంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

గ్రామ దేవతలకు పొంగళ్లు



ఊరేగింపుగా పొంగళ్లు నెత్తిన పెట్టుకొని అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

సీతారామపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని సంగసానిపల్లిలో జరుగుతున్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం గ్రామ దేవతలైన అంకాలమ్మ, పోలేరమ్మలకు గ్రామస్థులు పొంగళ్లు పెట్టారు. గ్రామం నుంచి ఊరేగింపుగా పొంగళ్లు నెత్తిన పెట్టుకొని ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

ఉదయగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం మినీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలు, తల్లులకు కిశోరి వికాసం కార్యక్రమంపై సూపర్‌వైజర్ షాను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు.

యథేచ్ఛగా చెరువులు, పంట కాలువల కబ్జా

పట్టించుకోని అధికారులు



పంట కాలువ ఆక్రమించి నిర్మించిన భవనాలు



ఆక్రమణలకు గురైన పంట కాలువ

వింజమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, పంట కాలువలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వింజమూరు సబ్ డివిజన్ పరిధిలో 115 చెరువులు ఉండగా మండలంలో 32 చెరువులు ఉండగా దాదాపు అన్నీ ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు పేర్కొంటున్నారు. వింజమూరు పట్టణంగా విస్తరిస్తుండడంతో పాతూరు చెరువుపై ఆక్రమణదారులు కన్నేశారు. ఇదే చెరువు పంట కాలువలు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. మండలంలోని కాటేపల్లి చెరువు అలుగు స్థలాన్ని ఆక్రమించి పంటలు పండిస్తున్నారు. బుక్కాపురం, బట్టినవారిపల్లి, తక్కెళ్లపాడు చెరువులు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. బుక్కాపురంలో సుమారు 50 ఎకరాలు ఆక్రమించి బోర్లు వేసి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసుకున్నారు. మొక్కజొన్న, మినుము తదితర పంటలు సాగు చేస్తున్నారు. బత్తినివారిపల్లిలో 30 ఎకరాలలో జామాయిల్ వేసినట్లు స్థానికులు తెలిపారు.

చర్యలు తీసుకుంటాం: టీ. రమణరావు, డీఈఈ

మండలంలో ఐదు చెరువుల్లో ఆక్రమణలు గుర్తించామని డీఈఈ టి.రమణరావు తెలిపారు. సర్వే చేయించి హద్దులు చూపాలని ఆ శాఖ అధికారులను కోరామని, సర్వే చేసి హద్దులు చూపితే కట్టడి చేస్తామన్నారు. అలాగే పట్టణంలో కూడా పంట కాలువల ఆక్రమణపై చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుకు ఘన నివాళి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంధపాలకుడు డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

ఉదయగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దార్లు, ఆపరేటర్లు, రాజకీయ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,41,444 మంది ఓటర్లు ఉండగా 323 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులతోపాటు చనిపోయిన వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో సుభద్ర, పలు మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు బయ్యన్న, బొజ్జా నరసింహులు, గడ్డం వెంకటేశ్వర్లు, నల్లిపోగు నరసింహ, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ విజయమ్మ

ఉదయగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో అర్హులైన వారికి ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని ఎంపీటీసీ కాకు విజయమ్మ పంచాయతీ కార్యదర్శి చినబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పక్కాగృహాల కోసం పంచాయతీలో పలు గ్రామాలకు చెందిన అర్హులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి సొంత స్థలం ఉన్నా ఇంతవరకు కాలనీలు మంజూరు చేయలేదన్నారు. కొంతమందికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థలాన్ని గుర్తించి అర్హులైన వారికి ఇంటి నివేశన స్థలాలు మంజూరుచేసి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్ని రంగాలలో మహిళలు రాణించాలి



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఏఎస్ పేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో రాణించాలని జీసీడీఎస్ సూపర్‌వైజర్ పి విజయలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, అసమానతలపై అవగాహన కల్పించారు. బాలికలు బావితరాలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె విజయలక్ష్మి, పి సావిత్రి, షకీరా బేగం, జి ఇంద్రాణి, కె కృష్ణకుమారి, ఎం సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

సంగం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్ల వద్ద మంగళవారం పోలీసులు హెచ్చరిక నోటీస్ బోర్డు చేశారు. ఇటీవల ఇద్దరు విద్యార్థులు సరదాగా ఈతకు వెళ్లి కనిగిరి ప్రధాన కాలు వ నీటిలో గల్లంతైన విష యం విదితమే. అంతేకాకుండా రెండు రోజుల కిందట ఓ వృద్ధుడు అదే కాలువలో నీటిలో పడి మృతి చెందిన సంఘటన జరిగింది. దీంతో సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్‌లు స్పందించి కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరూ నీటిలో దిగవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఈత కోసం కాలువలో దిగితే శిక్షార్హులని అందులో పేర్కొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

వింజమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు నీలం వాసు, బట్టల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేకులు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో రాజేష్‌నాయుడు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 45.627 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి 45.627 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో జరిగే మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి కోరారు. మంగళవారం రవితేజ కల్యాణ మండపంలో పట్టణ టీడీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి కన్వీనర్లు, కోకన్వీనర్లు, గ్రామ, వార్డు, మండల స్థాయి కార్యవర్గం, కుటుంబ సాధికార సారధులు, టీడీపీ శాశ్వత సభ్యులు అందరూ హాజరవుతారని తెలిపారు. ఆత్మకూరు పట్టణ పరిధి నుంచి ప్రతిఒక్కరూ హాజరై మినీ మహానాడును విజయవంతం చేయాలని కోరారు. నేతలు, కార్యకర్తలు తప్పనిసరిగా సభ్యత్వ గుర్తింపు కార్డుతో పాటు పసుపు రంగు చొక్కా ధరించి పాల్గొనాలని కోరారు. అనంతరం ఆత్మకూరు పట్టణ కమిటీ ఏర్పాటుకు టీడీపీ శ్రేణుల నుంచి సూచనలు, సలహాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ సీనియర్ నేతలు, వార్డు అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

● కలువాయి: వెంకటగిరి పట్టణంలోని పింజలి వీరయ్య కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ నిర్వహించ తలపెట్టిన మినీ మహానాడును విజయవంతం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ జీ వెంకటేశ్వర్లు నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు గొల్ల నరసింహయాదవ్ హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్య కర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



జనసేన సభ్యత్వాల కిట్లను పంపిణీ చేస్తున్న నేతలు

ఉదయగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు నియోజకవర్గ నాయకులు భోగినేని కాశీరావు, కొట్టె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని జనసైనికులకు క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 4వేల మందికి సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సభ్యత్వాల నమోదులో జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గం మూడో స్థానంలో నిలిచిందన్నారు. క్రియాశీలక సభ్యత్వం ఉన్నవారికి రూ.5 లక్షల బీమా, రూ.50 వేలు ప్రమాద బీమా కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సురేంద్ర రెడ్డి, బండారు సత్యనారాయణ, అలూరి రవీంద్ర, పెట్లు కిరణ్, నాయబ్‌రసూల్, రవికుమార్, కె శ్రీనివాసులు, రాఘవేంద్ర, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుచేయాలి : సీఐటీయూ



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు

ఆత్మకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, కర్షకులు, ఉద్యోగుల హక్కులను కాపాడాలని కోరుతూ మంగళవారం ఆత్మకూరు పట్టణంలో సీఐటీయు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయు జిల్లా నాయకుడు జి శివప్రసాద్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దుచేయాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన జరుగు దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, కె డేవిడ్‌రాజు, రైతు సంఘం నాయకులు జి లక్ష్మీపతి, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి పి రాధమ్మ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, యూటీఎఫ్, ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎల్ఐసీ, యుఈఈయు, మున్సిపల్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నూతన కమిటీ ఎంపిక



ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్‌ఎంయూ నూతన కమిటీ సభ్యులు

ఉదయగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడిగా షేక్ రియాజ్, ముఖ్య సలహాదారుడిగా ఎం వెంకటేశ్వర్లు, చైర్మన్‌గా బీ నాగరాజు, అధ్యక్షుడిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్‌కే విశ్వనాథ్, కార్యదర్శిగా శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుత్ స్తంభం పడి యువకుడి మృతి



వెంకటేష్ (ఫైల్)

కావలి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పడి మద్దెల వెంకటేష్ (32) మృతి చెందిన ఘటన మంగళవారం కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో జరిగింది. రెండవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన వెంకటేష్, సుబ్బారావులు మంచి స్నేహితులు. వెంకటేష్ బైక్ మెకానిక్ కాగా సుబ్బారావు ఉదయగిరి రోడ్డులోని వైన్ షాపు ముందు చికెన్ పకోడి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వర్షం పడుతుండంతో సుబ్బారావు తన చికెన్ పకోడి బండి వద్ద వర్షపు నీరు పడకుండా పట్టకట్టేందుకు వెంకటేష్‌ను తీసుకువెళ్లాడు. సుబ్బారావు స్టూలు వేసుకుని విద్యుత్ స్తంభానికి తీగతో పట్ట కడుతుండగా వెంకటేష్ స్తంభం పక్కన నిలబడి ఉన్నాడు. ఈ క్రమంలో ఆ విద్యుత్ స్తంభానికి సపోర్టుగా దెబ్బతిని ఉన్న మరో స్తంభం ఒక్కసారిగా రెండు ముక్కలుగా విరిగి ఒక ముక్క వెంకటేష్ తలపైన పడింది. దీంతో తలపగిలి మెదడు బయటకు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ గిరిబాబు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య మౌనిక, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేష్ మృతితో బాలకృష్ణారెడ్డి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలే ప్రమాదాలకు కారణమవుతూ నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని మృతుడి బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత



పోలీసులు పట్టుకున్న చికెన్ వ్యర్థాల వాహనం

సంగం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని స్థానిక పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కోవూరుకు చెందిన కార్తీక అనే వ్యాపారి బెంగళూరు నుంచి చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా ముంబాయి జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. వాహనంలో 25 డ్రమ్ములలో ఉన్న చికెన్ వ్యర్థాలను కలిగిరి రహదారిలోని కొండ ప్రాంతంలో గుంతతీసి పూడ్చివేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

వీడని రాపూరు హత్య కేసు మిస్టరీ

● కొనసాగుతున్న దర్యాప్తు



సంఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసులు



షఫీ (ఫైల్)

రాపూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాపూరుకు చెందిన షేక్ షఫీ హత్య కేసు మిస్టరీ వీడ లేదు. హత్య జరిగి నాలుగైదు రోజులైనా ఎవరు చంపారు, ఎందుకు చంపారు అనే విష యం ఇంకా తేలలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. కూల్ డ్రింక్ షాప్ నిర్వహిస్తున్న షేక్ షఫీ (52) ఈనెల 16వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో దుకాణాన్ని మూసి ఇంటికి బయలుదేరాడు. తాతిపల్లి గ్రామ సమీపంలో అతను హత్యకు గురై విగత జీవిగా పడిఉన్నట్లు కొంతమంది స్థానికులు కండలేరు పోలీసులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన వెళ్లిన కుటుంబసభ్యులు చనిపోయిన వ్యక్తి షఫీగా గుర్తించారు. ఈ సంఘటనతో రాపూరు మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

కొనసాగుతున్న దర్యాప్తు

ఈ హత్య కేసును పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సేవలను వినియోగించుకొని దర్యాప్తు చేస్తున్నారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. రాపూరుకు చెందిన కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

గొలుసులు కొంటామంటూ దోచేశారు

● నలుగురు మహిళల అరెస్టు ● చోరీ సొత్తు స్వాధీనం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), మే 20 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకు వెండి గొలుసు లు కొనుగోలు పేరుతో తియ్యటి మాటలు చెప్పిన మహిళలు ఏడు జతల గొలుసులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుతో చోరీకి పాల్పడిన నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరు కోటమిట్టకు చెదిన దగ్గోలు చెంచుముని రెడ్డి ఆ చారివీధిలో మేఘన శ్రీ జ్యూయలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆ దుకాణానికి 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన ముగ్గురు మహిళలు వచ్చారు. కాళ్లవ ట్టీలు(గొలుసులు) చూపించమని అడిగారు. వెండి పట్టీలను చూపిస్తుండగా మాయ మాటలు చెప్పి రూ.70 వేలు విలువ చేసే సుమారు 740 గ్రాముల బరువున్న 7 జతల పట్టీలను దోచుకెళ్లారు. మహిళలు షాపు నుంచి వెళ్లిన తర్వాత దొంగతనం జరిగినట్లు గుర్తించిన యజమాని చిన్నబజారు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్టు

ఈ కేసులో నిందితులను పట్టుకున్నట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం రాత్రి స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేశామని, నిందితులను అన్నమయ్య జిల్లా వావిలపాడు మండలం చింతపత్తి గ్రామానికి చెందిన గీత, జ్యోతి, రవళి, నరసమ్మగా గుర్తించామని చెప్పారు. వీరిని నెల్లూరులోని కూరగాయల మార్కెట్ సమీ పంలో మంగళవారం సాయంత్రం అరెస్టు చేశామని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బిట్రగుంట, మే 20(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని కొడవలూరు- పడుగుపాడు రైల్వే స్టేషన్ల మధ్య 184/28-30 కిలోమీటర్ల మధ్య (45)ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించి నట్లు కావలి జీఆర్పీ ఎస్ఐ రమాదేవి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. మృతుడు కాషాయం రంగు ఫుల్‌చొక్కా, పసుపు, మెరూన్ రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి పొట్టపై ఆపరేషన్ చేసిన మార్కు ఉంది. మృతదేహాన్ని కావలి ఏరియా ఆసు పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆమె తెలిపారు.



తిరుమలలో తరచూ భద్రతా వైఫల్యాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో నాలుగు నెలలు ఆలస్యంగానైనా ప్రభుత్వం టీటీడీకి రెగ్యులర్ సీవీఎస్వోను నియమించింది. విశాఖపట్నంలో ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణను టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణ

- ఎట్టకేలకు రెగ్యులర్ అధికారి నియామకం
- తొక్కిసలాట నుంచీ పాక్‌తో ఉద్రిక్తతల దాకా...
- తిరుమల భద్రతకు పెరుగుతున్న ప్రాముఖ్యత
- తరచూ వైఫల్యాలతో ఆందోళన

టీటీడీకి సంబంధించి అలిపిరి టోల్‌గేటు మొదలుకుని, తిరుమల దాకా తరచూ ఎక్కడో ఒక చోట ఏదో విధంగా భద్రతా వైఫల్యం వెలుగు చూస్తూనే ఉంటోంది. ఈ ఏడాది జనవరి 8వ తేదీన తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు మరణించడం, సుమారు 40 మంది దాకా గాయపడడం తెలిసిందే. టీటీడీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కుదిపేసిన ఈ ఘటనకు టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌ను, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడిని బాధ్యులుగా పరిగణించి ప్రభుత్వం వారిద్దరినీ తక్షణం బదిలీ చేసింది. ఇతర టీటీడీ అధికారులపైనా బదిలీ వేటు పడినా భద్రతాపరంగా ఆ ఇద్దరు ఐపీఎస్ అధికారులనే ప్రభుత్వం బాధ్యులుగా పరిగణించింది. చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలును టీటీడీ సీవీఎస్వోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించింది. చిత్తూరులో ఎస్పీగా పనిచేస్తూ టీటీడీ సీవీఎస్వోగా పనిచేయడం ఇబ్బందిగా మారడంతో గత మార్చి 12న చిత్తూరు ఎస్పీ స్థానంలో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజును ఎఫ్ఏసీ సీవీఎస్వోగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి ఎస్పీగా అధిక సమయం ప్రొటోకాల్ డ్యూటీలకు కేటాయించాల్సిన అధికారికి టీటీడీ సీవీఎస్వో బాధ్యతలు అప్పగించడం విమర్శలకు దారి తీసింది.

పెరిగిన 'ఉగ్ర'ముప్పు : ఇటీవల పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొని ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో తిరుమలకు ఇస్లామిక్ ఉగ్రవాదులతో ముప్పు పెరిగిందన్న కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరికలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తిరుమలలో ఆక్టోపస్ బలగాలు కొండపైన, తిరుపతిలోనూ మాక్ డ్రిల్ నిర్వహించాయి. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో కూడా భద్రత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడింది. డ్రోన్లతో ముప్పు పెరిగినందున యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో పడింది టీటీడీ. ఇలాంటి పరిస్థితుల్లో టీటీడీకి పూర్తిస్థాయి సీవీఎస్వో లేకపోవడం విమర్శలకు దారి తీసింది.

రెండేళ్లుగా భద్రతా వైఫల్యాలు

ఈ ఏడాది జరిగిన తొక్కిసలాట ఘటనే కాకుండా అలిపిరి టోల్‌గేటు వద్ద, తిరుమలలోనూ గత రెండేళ్లుగా తరచూ భద్రతా వైఫల్యాలు సంభవిస్తున్నాయి.

- 2023 జనవరిలో సర్వే కోసం తిరుమలకు వచ్చిన ఓ సంస్థ సిబ్బంది ఆలయంపై డ్రోన్ ఎగురేసి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేశారు.
- 2023 మేలో ఓ యువకుడు ఏకంగా శ్రీవారి ఆలయంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లి ఆనంద నిలయాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ● 2024 జనవరిలో అస్సోం నుంచీ వచ్చిన ఓ జంట తిరుమల ఘాట్ రోడ్డులో డ్రోన్ ఎగురేసింది.
- ఈ ఏడాది జనవరి 17న కడపవాసులు ఎగ్ బిర్యానీ తిరుమలకు తెచ్చి బహిరంగంగా తిన్న ఘటన కలకలం రేపింది.
- ఇటీవల అటవీశాఖకు చెందిన వ్యక్తులు టీటీడీ అనుమతి లేకుండా టోల్‌గేట్‌లో భద్రతా సిబ్బందికి కూడా తెలియకుండా పడవలనే తిరుమలకు తీసుకెళ్ళి పాపవినాశనం రిజర్వాయర్‌లో బోటింగ్ ట్రయల్స్ కూడా నడిపారు.
- బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ స్వామీజీలతో కలసి తిరుమలలో ధర్నా చేయడం కలకలం రేపింది.
- గత నెల 15న రాజస్థాన్‌కు చెందిన యూట్యూబర్ అనుష్మాన్ తరేజా శ్రీవారి ఆలయంపై పది నిమిషాల పాటు డ్రోన్ ఎగరేసి వీడియో చిత్రీకరించారు. అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా సిబ్బంది తనిఖీల సందర్భంగా డ్రోన్లను గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
- ఈ ఏడాది మార్చి 31న రంజాన్ రోజు తిరుపతి సింగాలగుంటకు చెందిన అజ్మత్ ఖాన్ (35) అలిపిరి టోల్‌గేటులో వీఐపీ లైన్‌లో బైక్ మీద భద్రతా సిబ్బంది ఆపినా ఆగకుండా తిరుమలకు దూసుకెళ్ళిన ఘటన కలకలం రేపింది. అతడిని తిరుమల జీఎన్‌సీ టోల్‌గేటు వద్ద సిబ్బంది అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితి బాగాలేదని పోలీసులు విచారణలో తేల్చిన సంగతి పక్కన పెడితే అదే వ్యక్తి ఉగ్రవాది అయి ఉంటే అన్న ప్రశ్నకు టీటీడీ అధికారుల వద్ద ఎలాంటి సమాధానం లేదు.

శ్రీవారి సేవకు బదిలీ సంతోషదాయకం: మురళీకృష్ణ

టీటీడీ సీవీఎస్వో పోస్టుకు బదిలీ కావడమంటే శ్రీవారి సేవకు నోచుకోవడమేనని, ఆ అవకాశం రావడం సంతోషదాయకంగా ఉందని మురళీకృష్ణ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో పలకరించగా టీటీడీ సీవీఎస్వోగా బదిలీ రావడం శ్రీవారి ఆశీస్సులతోనేనన్నారు. గతంలో తిరుపతి, తిరుమలలో వివిధ హోదాల్లో పనిచేసి ఉన్నందున అక్కడి పరిస్థితుల పట్ల అవగాహన వుందన్నారు. భక్తుల భద్రతకు, టీటీడీ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శాఖాపరమైన శిక్షణలో వున్నానని, రెండు రోజుల్లో అది ముగించుకుని టీటీడీ సీవీఎస్వోగా బాధ్యతలు తీసుకుంటానన్నారు.

అనుభవం, కాఠిన్యం కలగలసిన అధికారి కావాలని..

టీటీడీ, తిరుమల వ్యవహారాల పట్ల అనుభవం కలిగివుండడంతో పాటు కఠినంగా వ్యవహరించగలిగిన అధికారిని సీవీఎస్వోగా నియమించాలని ప్రభుత్వం భావించింది.ఆ కోణంలో పరిశీలించిన ప్రభుత్వం విశాఖపట్నంలో ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణను టీటీడీ సీవీఎస్వోగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖకు చెందిన ఆయన 2011లో గ్రూప్స్ ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. డీఎస్పీగా తిరుపతి, తిరుమలలో పనిచేశారు. తిరుమలలో అదనపు ఎస్పీగా కూడా పనిచేశారు. అలాగే తిరుమలలో పనిచేస్తుండగానే ఎస్పీగా పదోన్నతి పొంది మూడు నెలల పాటు అక్కడే కొనసాగారు. తిరుపతిలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గానూ పనిచేశారు. తిరుపతి, తిరుమల, టీటీడీ వ్యవహారాల పట్ల తగినంత అనుభవం వుంది.దానితో పాటు విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరిస్తారన్న పేరుంది. వీటన్నింటికీ మించి శ్రీవారి పట్ల అపరిమిత భక్తిప్రపత్తులు ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణను ఎంపిక చేసినట్టు భావించాల్సి వస్తోంది.



గో మరణాల సంఖ్య తగ్గింపుపై దృష్టి

- త్వరలోనే మంచి ఫలితాలు వస్తాయి
- టీటీడీ బోర్డు సమావేశ నిర్ణయాలు వెల్లడించిన ఈవో



బోర్డు సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో, సభ్యులు

తిరుమల, మే20(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ గోశాలలో ప్రతినెలా 14వరకు గోవులు చనిపోతున్నాయని ఇప్పటికే గుర్తించాం. వంద గోవులు అసాధారణంగా చనిపోయాయంటూ చేసిన ప్రచారంలో వాస్తవాలు లేవు. గో మరణాలను తగ్గించేందుకు ప్రత్యేక దృష్టిసారించి ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. త్వరలో మంచి ఫలితాలను అందరూ చూస్తారు. గతానికంటే గో పరిరక్షణ మెరుగ్గా మారుస్తాం' అని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం ముగిశాక.. ఆ నిర్ణయాలను అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, శాంతారాం, ఆనంద్‌సాయితో కలిసి మీడియాకు ఈవో వెల్లడించారు.ఏఐ టెక్నాలజీ ద్వారా త్వరితగతిన దర్శనం కల్పనపై గూగుల్‌తో ఎంవోయూ పూర్తయిందన్నారు. టీసీఎస్ కూడా స్టడీ చేస్తోందన్నారు. గతంలో అంతా మ్యానువల్‌గా జరిగిందని, ఏఐ వినియోగించాలంటే డేటా అవసరమన్నారు. కొంత టెక్నాలజీ ఉపయోగించి గత పది నెలలుగా డేటాను స్టోర్ చేస్తూ వస్తున్నామన్నారు. ఇదో పెద్ద ఛాలెంజ్ అన్నారు. ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను త్వరలో పూర్తిచేస్తామన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు సంబంధించి కొన్ని నిర్ణయాలు ఉన్నాయని, దీంతో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. లీగల్‌గా కూడా కొన్ని ఇబ్బందులు ఉన్న క్రమంలో ప్రభుత్వానికి నివేదించామన్నారు. ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చిన తర్వాత ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇక, గత ప్రభుత్వంలో తులాభారంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై సీవీఎస్వో విచారణ ప్రారంభించారన్నారు. అలిపిరి కాలినడకమార్గంలో దివ్యదర్శన టోకెన్ల జారీపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) లేకపోవడంతో రెండు కాలినడకమార్గాల్లో దివ్యదర్శన టోకెన్లు ఇచ్చేవారిని, ప్రస్తుతం ఎస్ఎస్‌డీ ఇస్తున్న క్రమంలో అలిపిరిలో టోకెన్లు ఇవ్వడం సమస్యగా మారిందన్నారు. ఇక, శ్రీవారిమెట్టు మార్గంలోని టోకెన్ల జారీలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, కొందరు ఆటోవాళ్లు భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు గుర్తించామన్నారు. రానున్న పదిరోజుల్లో దీనిపై శాశ్వత పరిష్కారాన్ని అమలుచేస్తామన్నారు. తిరుమలలో మఠాల ఆక్రమణలపై స్టడీ చేస్తున్నట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. తిరుమలలోని విశ్రాంతి భవనాలకు ఆధ్యాత్మిక పేర్లు ఉండేలా టీటీడీ 75 పేర్లను సూచించిన క్రమంలో 42 భవనాలకు దాతలే పేర్లు మార్చుకున్నారని, మరో రెండింటి పేర్ల మార్పిడి జరగాల్సి ఉందన్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు మార్పు విషయంలో చర్చిస్తున్నామన్నారు.

గ్లోబల్ లెవల్ ఇన్‌స్టిట్యూట్‌గా స్విమ్స్

రాయలసీమకే తలమానికంగా ఉంటూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని 'గ్లోబల్ లెవల్ ఇన్‌స్టిట్యూట్‌'గా మార్చే లక్ష్యంతో ఉన్నామని టీటీడీ శ్యామలరావు అన్నారు. ఏటా స్విమ్స్‌కు టీటీడీ రూ.60 కోట్ల గ్రాంట్, వివిధ రూపాల్లో రూ.వంద కోట్లకుపైగా ఆర్థిక సాయం చేస్తోందని వివరించారు. లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్‌ను ఇంకా ఎలా మెరుగుపరచాలనే అంశంపై గతంలో నియమించిన డాక్టర్ బీవీ సుబ్బారావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను టీటీడీ బోర్డు ఆమోదించినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న వంద మంది ఫ్యాకల్టీ, 434 నర్సులు, 15 పారామెడికల్ స్టాఫ్, 48 మంది పరిపాలన విభాగ సిబ్బంది పోస్టుల నియామకానికి తీర్మానం చేశామన్నారు. శ్రీవారివైద్య సేవ కింద అనేక మంది డాక్టర్లు ముందుకు వచ్చి సేవలందిస్తున్నారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు గైడ్‌గా వ్యవహరించేందుకు 'వలంటీయర్ సేవ'ను కూడా ప్రారంభించావమన్నారు.

మరికొన్ని నిర్ణయాలు

● తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి శ్రీవారి ఆలయం, నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలేశ్వరస్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధికోసం బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్టుల నుంచి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం. ● ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయం.

369 ఎండీయూ వాహనాలకు బ్రేక్



తిరుపతి(నేరవిభాగం), మే 20 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి నేరుగా రేషన్ షాపుల వద్దే వినియోగదారులు సరుకులు తీసుకోవాల్సి ఉంటుంది. వైసీపీ హయాంలో అమలు చేసి.. లోపభూయిష్టంగా మారిన ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) వాహనాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. జిల్లాలో 1457 రేషన్ షాపుల్లో దాదాపు 5,91,268 కార్డులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఇంటింటికీ సరుకుల పంపిణీ చేసేందుకని వైసీపీ ప్రభుత్వం దాదాపు 369 ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాహనదారుడి వాటా, సబ్సిడీ పోను వాహనదారులు రూ.3500 చొప్పున బ్యాంకులకు నెలసరి వాయిదాలు చెల్లించాలి. అయితే, వైసీపీ ప్రభుత్వం నిర్వాహకులకు నెలనెలా గౌరవ వేతనం రూ.21 వేలను సక్రమంగా చెల్లించకపోవడంతో వీరు సకాలంలో ఈఎంఐలు చెల్లించలేకపోయారు. దీంతో కొందరు మధ్యలోనే బండ్లు నడపలేమని చెప్పి మానేశారు. మరమ్మతులకు గురైన వాటిని కొందరు అలాగే వదిలేశారు. ఇంకొందరైతే డీలర్లతో కలిసి.. షాపుల్లోనే సరుకులు ఇచ్చేసి, వాహనం తిరిగినట్లు చూపించారు. ఇలాంటి చోట్ల ఎండీయూ వాహనాల వల్ల ప్రభుత్వానికి ఖర్చు తప్ప, కార్డుదారులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పట్టణాల్లో వీధి మొదట్లో వాహనం పెట్టడంతో అందరూ అక్కడికి వెళ్లి రోడ్డు పక్కన క్యూలో నిలబడాల్సిన పరిస్థితి తలెత్తేది. మరికొందరు వాహనదారులైతే కార్డుదారుల వద్ద కిలో బియ్యం రూ.పది చొప్పున కొని నల్లబజారుకు తరలించిన ఘటనలు జిల్లాలో చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో లోపభూయిష్టంగా మారిన ఈ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి పాత విధానాన్నే తీసుకొచ్చింది.

జీవకోన సమగ్రాభివృద్ధికి చర్యలు

- 'ఆంధ్రజ్యోతి' సదస్సుతో కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి
- తుడా నిధులతో మరో రోడ్డు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- రేపు 'ఆంధ్రజ్యోతి' విజయోత్సవ సభలో మరికొన్నింటికి భూమిపూజ, ప్రారంభం కానున్న అవుట్ పోస్ట్

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం జీవకోన సమగ్రాభివృద్ధిపై ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టింది. 'అక్షరం అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా' తిరుపతిలోని జీవకోనలో మూడు నెలల కిందట ఆంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన సదస్సులో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక చొరవ చూపెట్టారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దాదాపు రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు పూర్తిచేశారు. మరో రూ.50 లక్షలతో శ్మశాన వాటికకు ప్రహరీ, సీసీ రోడ్లు, డ్రైన్లు, రోడ్డు ప్యాచ్ వర్క్స్ వంటి పనులు ప్రారంభించనున్నారు. జీవకోనలో గురువారం ఆంధ్రజ్యోతి నిర్వహించే విజయోత్సవ సభలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు. అదేవిధంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోలీస్ అవుట్ పోస్టును కూడా ప్రారంభించనున్నారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)నిధులతో లెప్రసీ కాలనీలో రోడ్డు వేయనున్నట్టు మౌర్య చెప్పారు. రూ.35లక్షలతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు.

కమిషనర్ పర్యటన

జీవకోనలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన, రాజీవ్‌గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి మంగళవారం ఆమె పరిశీలించారు. జీవకోన వంటి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేయాలని, ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్త తొలగించడం, కాలువలు శుభ్రం చేయడం వంటివి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్ఈ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి తదితరులున్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

శ్రీసిటీలో రూ.2475 కోట్లతో డైకిన్ ప్లాంట్ విస్తరణ

తిరుపతిలో రూ.327 కోట్లతో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ క్లస్టర్ హోటల్

- వడమాలపేటలో రూ.150 కోట్లతో ఫైవ్ స్టార్ రిసార్టు
- అనుమతులు, ప్రోత్సాహకాల మంజూరుకు మంత్రి మండలి ఆమోదం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో రూ.2952 కోట్ల పెట్టుబడులు.. 6070 మందికి ఉద్యోగాలు కల్పించేలా మంగళవారం నాటి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీసిటీలో మెస్సర్స్ డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ రూ.1604 కోట్లతో ఎయిర్ కండిషన్ల తయారీ ప్లాంటు నెలకొల్పింది. తాజాగా రూ.2475 కోట్లతో దీనిని విస్తరించేందుకు, 5150 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అనుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనిపై మంగళవారం మంత్రివర్గం చర్చించి అనుమతులు, ప్రోత్సాహకాలు మంజూరు చేయడానికి ఆమోదించింది. దీంతో శ్రీసిటీలో డైకిన్ సంస్థ పెట్టుబడులు రూ.4079 కోట్లకు చేరనున్నాయి.

● బెంగళూరుకు చెందిన మెస్సర్స్ స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తిరుపతిలో ఐబిస్ స్టైల్స్ త్రీ స్టార్, అలాగే నోవాటెల్ ఫైవ్ స్టార్ క్లస్టర్ హోటల్ నిర్మించేందుకు అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. మంత్రి మండలి ఆ ప్రతిపాదనలను ఆమోదించడంతో తిరుపతి శిల్పారామం ఆవరణలో 2.50 ఎకరాల భూమి కేటాయించనున్నారు. పలు ప్రోత్సాహకాలు అందించనున్నారు. రూ.327 కోట్లతో చేపట్టే ఈ క్లస్టర్ హోటల్ నిర్మాణం వల్ల 570 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

● ఒడిశాకు చెందిన మెస్సర్స్ బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్‌పి సంస్థ జిల్లాలో ఫైవ్ స్టార్ రిసార్టు ఏర్పాటుకు ముందుకొచ్చింది. దీనిపై మంత్రివర్గం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో వడమాలపేట మండలం ఎస్వీ పురం వద్ద 12.75 ఎకరాలను కేటాయించనున్నారు. రూ.150 కోట్లతో నిర్మించే ఫైవ్ స్టార్ రిసార్టు ద్వారా 350 మందికి ఉపాధి లభించనుంది.

తిరుమల పార్కులోకి దూసుకెళ్లిన కారు


ప్రమాదానికి గురైన కారు

● తప్పిన ప్రమాదం

తిరుమలలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి పార్కులోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కుటుంబం ఎస్వీ గెస్ట్‌హౌస్ నుంచి ఎంబీసీ వైపుగా వెళుతున్నారు. ఈ క్రమంలో కారు అతివేగంగా పార్కులోకి దూసుకెళ్లింది. సుమారు 20 అడుగులు ముందుకెళ్లి ఇనుప కంచెను ఢీకొని నిలిచిపోయింది. కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బ్రేక్ బదులుగా ఎక్సలేటర్‌ను తొక్కడం తోనే ప్రమాదం జరిగినట్టుగా తెలిసింది. కారు రోడ్డుపై కాకుండా పార్కులోకి వెళ్లడం, కొంతదూరం వెళ్లి ఆగిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు..

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రేపు హనుమజ్జయంతి వేడుకలు

ఏటా వైశాఖమాసం బహుళ దశమినాడు తిరుమల క్షేత్రంలో ఘనంగా నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలు ఈనెల 22వ తేదీన టీటీడీ వైభవంగా నిర్వహించనుంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి, కాలినడకమార్గంలోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తిరుమలలోని జపాలితీర్థంలోనూ హనుమజ్జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సంప్రదాయానుసారం టీటీడీ తరఫున జపాలి హనుమాన్‌కు పట్టువస్త్రాలు అందజేయనున్నారు. ఏడోమైలు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీనికిగాను ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు, స్థానికుల కోసం తిరుమల నుంచి ఏడోమైలు వరకు, తిరిగి తిరుమలకు చేరడానికి టీటీడీ ఉచిత రవాణా వసతి కల్పించనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,003

తలనీలాలు సమర్పించినవారు: 33,140

చక్కటీ అనుబంధం

● నేడు ప్రపంచ టీ దినోత్సవం

సరదాగా నలుగురు కలిసినా.. ఒత్తిడి అనిపించినా.. కాస్త తలనొప్పిగా ఉన్నా, సమయం, సందర్భం ఏదయినా ఠక్కున గుర్తొచ్చేది టీ. అంతెందుకు ఉదయం దినచర్య మొదలయ్యేది టీతోనే. ఇది తాగకుండా ఉండలేని వారెందరో మనలోనూ ఉన్నారు. సామాన్యుడి నుంచి ఉన్నత స్థాయి వరకూ టీకి ప్రాధాన్యమిస్తారు. మన ప్రధాని మోదీ చాయ్‌పే చర్చా పేరిట ప్రజలతో మమేకమవుతుంటారు. ఇలా టీ అందరి జీవితాలతోనూ ప్రత్యేక బంధాన్ని ఏర్పరచుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి









ఈ కేఫ్ కేరాఫ్ మహిళలు

ఈసారి అంతర్జాతీయ టీ దినోత్సవంలో మహిళల పాత్రకు పీటవేయాలని నిర్ణయించారు. టీ ఉత్పత్తి, పంపిణీలో మహిళల పాత్ర, గుర్తింపు అనే కోణంలో ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలనేది థీమ్. మన తిరుపతిలో టీ మాస్టర్ నుంచి సప్లయర్ల వరకు మహిళలు నడిపే స్మార్ట్ కేఫ్‌లున్నాయి. యజమానులు కూడా మహిళలే. ఎంఆర్‌పల్లె, లక్ష్మీపురం సర్కిళ్లలో ఇలాంటి స్మార్ట్‌కేఫ్‌ల్లో సుమారు 20మంది మహిళలు పనిచేస్తున్నారు. అన్నిరకాల టీ, కాఫీలు ఇక్కడ అమ్ముతున్నారు. రుచి, నాణ్యతలో రాజీలేకుండా పోటీ మార్కెట్‌కు దీటుగా కేఫ్ నడుపుతున్నారు.

ఎన్ని రకాల టీలో..


తిరుపతిలో మహిళలు నిర్వహిస్తున్న కేఫ్

ఒకప్పుడు టీ అంటే తేయాకు ఒక్కటే. ఆధునిక కాలంలో, మారుతున్న అభిరుచులకు అనుగుణంగా టీలో చాలా రకాలు వచ్చాయి. తిరుపతి నగరంలోనూ ఎక్కువ రకాలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య స్పృహ పెరిగి పంచదార వినియోగం తగ్గింది. అందుకే ఎక్కువ మంది బెల్లం.. అల్లం టీలపై ఆసక్తి చూపిస్తున్నారు. బ్లాక్ టీ, గ్రీన్ టీ, ఉలాంగ్ టీ, వైట్ టీ, పూ ఎయిర్ టీ, యెల్లో టీ అందుబాటులో ఉన్నాయి. బ్లాక్, గ్రీన్, హెర్బల్ టీలు ఎవరికి వారే ఇంట్లో తయారు చేసుకుంటున్నారు. ఇన్‌స్టంట్ ప్యాకెట్లను కొనుక్కొని వేడినీళ్లలో వేస్తే ఇట్టే రెడీ అయిపోతున్నాయి. జిల్లాలో చాలాచోట్ల ప్రత్యేకించి తాటిబెల్లం టీలను కూడా అమ్ముతున్నారు.

ఆరోగ్యానికి మంచిదేనండోయ్

టీ తాగడం వల్ల నాడీ సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. మానసిక ఒత్తిడి స్థాయి తగ్గుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. భోజనం తర్వాత బ్లాక్ టీ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుందని తేలింది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. గుండె రక్షణకు సహకరిస్తుంది. టీలోని పాలీఫెనాల్స్ అనే ఆక్సిడెంట్లు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థను కాపాడతాయి. సాంప్రదాయ టీలో కాఫీ కంటే తక్కువ కెఫిన్ ఉంటుంది. అల్లం టీ వంటి హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థకు మంచివి. యాంటిస్పాస్మోడిక్‌గా పనిచేస్తాయి.

- డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్

శ్రీవారి సేవలో ప్రముఖులు


జస్టిస్ జయచంద్రన్


మానస వారణాశి

సినీనటి, మిస్ ఇండియా-2020 మానస వారణాశి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మలుపు తిరిగిన మిస్సింగ్ కేసు

- కంచిలో బాలుడి మృతి?
- అక్కడే పాతిపెట్టేసిన యజమాని
- మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసు బృందాలు


వెంకటేశులు (ఫైల్)

సత్యవేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలంలో సోమవారం వెలుగు చూసిన గిరిజన బాలుడు వెంకటేశులు అదృశ్యం కేసు మలుపు తిరిగింది. గూడూరు మండలం చవటపాళెం గ్రామానికి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తాను చేసిన అప్పు కోసం తన తొమ్మిదేళ్ళ కుమారుడు వెంకటేశులును బాతులు మేపేందుకు సత్యవేడు పట్టణం దళవాయి అగ్రహారానికి చెందిన వ్యాపారి వద్ద పది నెలల క్రితం పనిలో పెట్టారు. తన కుమారుడు కనిపించక పోవడంతో పలుమార్లు ఆమె ఆ వ్యాపారిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో అతడిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు యజమాని, ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులో తీసుకుని విచారించగా బాలుడు అదృశ్యంపై సంచలన విషయాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. బాతులు మేపేక్రమంలో నెల రోజుల క్రితం బాతుల వ్యాపారి ముత్తు బాలుడు వెంకటేశులును కంచి పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆ బాలుడు అనారోగ్యానికి గురై మృత్యువాత పడినట్లు తెలిసింది. దీంతో బాలుడి మృతదేహాన్ని తల్లికి అప్పగించకుండా కంచి పరిసర ప్రాంతంలోనే ముత్తు పాతిపెట్టినట్లు సమాచారం. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు మంగళవారం కంచికి చేరుకుని, తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. బాలుడు మృతిచెంది ఇరవై రోజులకు పైగా అయినట్లు సమాచారం. కంచిలో బుధవారం బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది.

డామిట్.. కథ అడ్డం తిరిగింది

● జేమ్స్‌పై దాడిచేసింది వైసీపీ బ్యాచే ● బెడిసికొట్టిన పన్నాగం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవను రాజకీయం చేసిన వైసీపీ బ్యాచ్ పన్నాగం బెడిసికొట్టింది. చచ్చేలా కొట్టి మూత్రం తాగించారని ఫిర్యాదు చేసిన ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్ వ్యవహారాన్ని వైసీపీ రాజకీయ లబ్ధి కోసం వాడుకునే ప్రయత్నం చేసింది. వ్యక్తిగత గొడవను కూటమిపై రుద్ది పబ్బం గడుపుకోవాలని చూసింది. దళితులను రెచ్చగొట్టేలా ఆ పార్టీ పత్రిక ద్వారా విషం చిమ్మింది. అయితే దాడి చేసింది వైసీపీ పెద్దల అనుచరులేనని తేలడంతో 'డామిట్..కథ అడ్డం తిరిగింది' అని నాలుక్కరుచుకుంది. ఈనెల 15వ తేది అర్ధరాత్రి తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, దాడిచేసిన ఘటనకు సంబంధించి ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు యశ్వంత్, కిరణ్, జగ్గ, లలిత్, సాయిగౌడ్, వంశీ, రూపేష్ ఇంకా మరికొంత మంది నిందితులుగా కేసు నమోదైంది. నిందితుల్లో జగదీష్ అలియాస్ జగ్గ, లలిత్, గోపాల్, నాని, సాయి గౌడ్ వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరులుగా తెలిసింది. రూపేష్ అలియాస్ రూపి, సాయికిరణ్‌కుమార్ రెడ్డి తిరుపతి వైసీపీ ఇన్‌చార్జి భూమన అభినయ్ అనుచరులు కాగా, వంశీ అలియాస్ చోట బ్లేడ్ ఎంపీ గురుమూర్తి అనుచరుడిగా తెలుస్తోంది. ఇంకా మరికొంతమంది నిందితులపై కేసు నమోదు చేశారు. వైసీపీలో పైస్థాయి నుంచి వారిని అనుచరగణం వరకు నేరపూరితధోరణిలో ఉంటారనడానికి ఇలాంటి ఘటనలే నిదర్శనమని కూటమి నాయకులు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో కూడా వైసీపీ తన సహజవైఖరిని విడిచిపెట్టడంలేదని అంటున్నారు.

జేమ్స్ కిడ్నాప్ కేసులో దర్యాప్తు ముమ్మరం

తిరుపతి(నేరవిభాగం),మే20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన ఘటనలో దర్యాప్తు ముమ్మరం చేశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పోలీసులు కలసి బాధితుడి స్వగ్రామం నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రెడ్డిపాలేనికి మంగళవారం వెళ్లి విచారించారు. ఘటనకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. అతడి నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంటు రికార్డు చేశారు. ఇప్పటి వరకు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మంగళవారం బెంగళూరులో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

● టీడీపీ మహానాడు కమిటీల్లో

ఉమ్మడి జిల్లా నుంచీ 16 మందికి చోటు

అనగాని, దగ్గుమళ్ల, పులివర్తి, పంతగాని, అమర్, అనిమినికి కీలక బాధ్యతలు

మరికొందరికి కమిటీల్లో సభ్యత్వం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 16 మంది నేతలకు చోటు దక్కింది. వీరిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమన్వయ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. మంత్రి అనగానికి పార్టీ అదనంగా ఆర్థిక వనరుల కమిటీకి కన్వీనర్‌గా, భోజనాల ఏర్పాట్ల కమిటీ కో కన్వీనర్‌గా కీలక బాధ్యతలను అప్పగించింది. అలాగే, అమరనాథరెడ్డికి జనసమీకరణ కమిటీ కో కన్వీనర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించింది. మహానాడు సభ అలంకరణ కమిటీ కన్వీనర్‌గా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి ముఖ్యమైన బాధ్యత అప్పగించారు. వలంటీర్ల నిర్వహణ కమిటీకి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ మహానాడులో సాంస్కృతిక కార్యక్రమాల కమిటీకి కో కన్వీనర్ బాధ్యతలు తలకెత్తుకున్నారు.

పలు కమిటీల్లో మరికొందరికి సభ్యత్వం

జనసమీకరణ కమిటీ సభ్యుడిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, తీర్మానాల కమిటీలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, వసతి ఏర్పాట్ల కమిటీలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ కుమారుడు పులివర్తి వినీల్ సభ్యులుగా నియమితులయ్యారు. పత్రికా, మీడియా, సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా తిరుపతికి చెందిన టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నీలాయపాలెం విజయ్‌కుమార్‌ను పార్టీ నియమించింది. సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే పులివర్తి నానీకి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇన్‌చార్జి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం రవాణా కమిటీలోను, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి.థామస్ రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. వలంటీర్ల నిర్వహణ కమిటీ సభ్యులుగా పీలేరుకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మదనపల్లెకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు సభ్యులుగా నియమితులయ్యారు. ఇలా.. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సహా మొత్తం 16 మందికి మహానాడులో వేర్వేరు బాధ్యతలను పార్టీ అప్పగించింది.

ఐసెట్‌లో 2627 మంది పాస్

● ఇద్దరికి రాష్ట్రస్థాయి ర్యాంకులు


రాష్ట్రస్థాయి 7, 10 ర్యాంకులు సాధించిన అజయ్‌కుమార్, మహేంద్రసాయి

తిరుపతి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఐసెట్ ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. జిల్లాలో 2759 మంది పరీక్ష రాయగా 2627 మంది ఉత్తీర్ణులయ్యారు. 1350 మంది పురుషులకు 1296 మంది.. 1409 మంది మహిళలకు 1331 మంది పాసయ్యారు. తిరుపతికి(వేదాంతపురం) చెందిన వలిపి అజయ్‌కుమార్ 174.17 మార్కులతో రాష్ట్రస్థాయిలో 7వ.. సూళ్లూరుపేట సమీపం మన్నారుపోలూరుకు చెందిన చామ మహేంద్రసాయి 171.91 మార్కులతో రాష్ట్రస్థాయి 10వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఎస్వీయూ పరిధిలో 12804 మంది పరీక్ష రాయగా 12096మంది అర్హత సాధించారు. వీరిలో 6295మంది పురుషులకిగాను 5947మంది క్వాలిఫై కాగా 6509మంది మహిళలకి గాను 6149 మంది అర్హత సాధించినట్లు ఐసెట్ నిర్వాహకులు ప్రకటించారు. 'హైదరాబాద్‌కి చెందిన డెలాయిట్‌సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నా. యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే పలు పోటీపరీక్షలు రాస్తున్నా. దీనిలో భాగంగానే ఏపీఐసెట్‌ని రాశా. సివిల్‌సర్వీసెస్/గ్రూప్‌వన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలన్నది నా జీవితాశయం'అని అజయ్‌కుమార్ తెలిపారు. 'ఆంధ్రాయూనివర్సిటీలో 2024లో బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్)పూర్తి చేశా. క్యాట్ పరీక్షకి ప్రిపేర్‌అవుతూనే ఐసెట్ రాశా. ఉన్నతస్థాయి ఉద్యోగంలో స్థిరపడాలన్నది నా లక్ష్యం' అని మహేంద్రసాయి పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు నేడు రుయాలో ప్రత్యేక మెడికల్ క్యాంప్

● ఈ ధ్రువీకరణ పత్రాల ద్వారానే బదిలీలు: డీఈవో

తిరుపతి(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్- 2025 ప్రకారం రీఅప్పోర్షన్‌కు గురై ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు బుధవారం తిరుపతి రుయాస్పత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మెడికల్ క్యాంప్ ప్రారంభమవుతుందని, బదిలీలకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద పత్రాలు పొందాలనుకున్న ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. ప్రస్తుత చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ క్యాంప్ ద్వారా పొందిన సర్టిఫికెట్ల ఆధారంగా మాత్రమే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేస్తారని డీఈవో స్పష్టం చేశారు.

పీఎంఏజీవై కింద 171 గ్రామాలు ఎంపిక

తిరుపతి(కలెక్టరేట్), మే 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన (పీఎంఏజీవై) కింద జిల్లాలో 171 గ్రామాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. షెడ్యూల్ కులాల ఆధిక్యం కలిగిన గ్రామాల్లో సమగ్రాభివృద్ధి చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా కనీసం 40 శాతం ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలు, 500 జనాభా ఉన్న గ్రామాలకు (2011 జనగణన ఆధారంగా) ప్రాధాన్యమిస్తారని తెలిపారు. పీఎంఏజీవై ద్వారా పల్లెలు ఆదర్శ గ్రామాలుగా రూపాంతరం చెందాలనే నినాదంతో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పీఎంఏజీవై పథకం నోడల్ అధికారి డీడీ, నెల్లూరు, చిత్తూరు జడ్పీ సీఈవోలు, డ్వామా పీడీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీలను అలసత్వం, రీఓపెన్‌కు తావులేకుండా పరిష్కరించాలన్నారు. వారికి సంతృప్త పరిష్కారం చూపాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం మండల, డివిజన్ పరిధిలో తప్పనిసరిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులు పూర్తిచేయాలని, భూసేకరణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టి, ఆర్డీవోలు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

● ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: కలెక్టర్

జిల్లాలో ఈ నెల 25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు-2025కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షలకు తిరుపతి జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,261 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, హెడ్‌సెట్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

డ్రైవర్‌పై యువకుల దాడి ● కేసు నమోదు

ఓజిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాన్ని పురస్కరించుకుని దాడి సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గూడూరుకు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్‌ను రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై ఆటో వెనుక నుంచి ఢీకొంది. దీనిపై ట్యాంకర్ డ్రైవర్ మహేష్ ఆటో డ్రైవరును ప్రశ్నించాడు. ఇంతలో అక్కడే ఉన్న కొందరు యువకులు ఆటో డ్రైవరుకు మద్దతుగా ట్యాంకర్ డ్రైవరుపై దౌర్జన్యం చేశారు. ట్యాంకర్ తాళాలు లాక్కుని డబ్బులు డిమాండు చేశారు. ఈ విషయాన్ని ట్యాంకరు డ్రైవరు గూడూరులోని తమ మేనేజరుకు తెలిపారు. వెంటనే గురుప్రసాద్, అతని స్నేహితుడు నహీమ్ రాజుపాళెం చేరుకుని వివరాలు తెలుసుకుంటున్నారు. ఇంతలో మరి కొంతమంది యువకులు అక్కడికి చేరుకున్నారు. వారిలో నలుగురు యువకులు కర్రలు, రాడ్లతో దాడి చేయడంతో నహీమ్, గురుప్రసాద్ గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వప్న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ పాటించకపోతే కఠిన చర్యలు



అంగన్‌వాడీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంతబాయి

కోట, మే 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖచ్చితంగా మెనూ పాటించాలని, తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంతబాయి హెచ్చరించారు. కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురం అంగన్‌వాడీ కేంద్రం, బాలసదనం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలను మంగళవారం పీడీ తనిఖీ చేశారు. చిన్నారులకు పెడుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో విటమిన్లు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు వస్తే సంబంధిత సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బాలామృతం, బాల సంజీవని గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె వెంట సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కవిత, కృష్ణమ్మ, పద్మమ్మ ఉన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



క్రికెట్ ఆడుతున్న గోవిందపల్లి, గూడూరు జట్లు

కోట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నంలో మంగళవారం రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈనెల 18 నుంచి కొత్తపట్నంలో కేపీపీఎల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మూడవ రోజు గోవిందపల్లి జట్టుపై గూడూరు విజయం సాధించింది. ఈ పోటీల్లో 36 జట్లు పాల్గొంటున్నాయని, విజేతలకు ప్రథమ బహుమతిగా రూ 30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ బహుమతి అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ల పంపిణీ



డీటీ నిరంజన్‌కుమార్‌కు ఉగాది తెలుగు క్యాలెండర్లు అందజేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

చిట్టమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరులోని ప్రభుత్వ కార్యాలయాల్లో త్రైత సిద్ధాంత ఉగాది 47వ సంవత్సర తెలుగు క్యాలెండర్లను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దారు కార్యాలయంలో డీటీ నిరంజన్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చిన్న బలరామయ్య, ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి బాబూరావుకు త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను అందజేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారం కోసం జులై 9వ తేదీ చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంవీధిలో మంగళవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల వివరాల మేరకు... నెల్లూరుకు చెందిన లక్ష్మి గూడూరు పట్టణంలోని శివాలయం వీధిలోని సుబ్రహ్మణ్యం తనను నమ్మించి మోసం చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపిస్తూ అతని ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో వివాదం జరగడంతో మనస్థాపానికి గురైన లక్ష్మి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయండి

డక్కిలి, మే 20(ఇంద్రజ్యోతి): అన్నిశాఖల ఉద్యోగుల పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యేలా జీవో విడుదల చేయాలని మహాజన టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య హోం మంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన అమరావతిలోని సచివాలయంలో హోం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

టీటీడీ గోశాలకు 10 జెంబో కూలర్ల వితరణ

తిరుపతి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలకు మంగళవారం పది జెంబో కూలర్లు విరాళంగా అందాయి. టీటీడీ బోర్డు సభ్యుడు రంగశ్రీ రూ.2.5లక్షల విలువచేసే ఈ కూలర్లను గోశాల డాక్టర్లకు అందజేశారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం

సూళ్లూరుపేట, మే 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో మంగళవారం మహాచండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నైకి చెందిన రవి, వలర్‌మతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



చండీయాగంలో పాల్గొన్న ఉభయదాత రవి దంపతులు

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం



విద్యార్థినికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పరిశ్రమలను తీసుకువస్తుందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని అభివృద్ధి పథంలో నడిపించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ ఉపాధి అవకా శాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగ యువతకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు 432 మంది హాజరుకాగా 232 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంత రావు, విద్యాసాగర్, లోకనాథం, మధుసూదనరావు, వాణి, భానుచందర్, అబ్దుల్‌రహీం, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, మునిగిరీష్, గుండాల లీలావతి, సోమిశెట్టి చెంచురామయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటుకు చర్యలు

సూళ్లూరుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తిరుపతి నగరపాలక కమిషనర్, తుడా వైస్ చైర్మన్ మౌర్య, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, అధికారులతో కలిసి పర్యటించారు. తరగతి కుటుంబాలకు ఇళ్ల ప్లాట్లు అందించేందుకు మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు, టిడ్కో ఇళ్ల సమీపంలో ప్రభుత్వ భూములను ఆమె పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో ఒక పార్కు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ తుడా వైస్ చైర్మన్‌ను కోరారు. వెంటనే ఆమె వట్రపాలెం సమీపంలో ఉన్న ఉద్యావన పార్కు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే పార్కును అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలో ఉన్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు సూళ్లూరుపేటలో మరో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ చిన్నయ్య, తహసీల్దార్ నరసింహారావు, టీడీపీ నాయకులు ఏజీ కిషోర్, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, మునస్వామి, సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



వట్రపాలెంలో పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న తుడా వైస్ చైర్మన్ మౌర్య, ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

హత్యకు గురైన వీణమ్మ పిల్లల కోసం అన్వేషణ



మల్లాంలో విచారిస్తున్న సీడీపీవో ఉమామహేశ్వరి

చిట్టమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మడపలంలో సోమవారం భర్త చేతిలో హత్యకు గురైన వీణమ్మ పిల్లల ఆచూకీ కోసం ఐసీడీఎస్ అధికారులు చిట్టమూరు మండలంలో అన్వేషించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఈ పిల్లలకు దిక్కెవరు' అనే వార్తకు స్పందించిన నాయుడుపేట ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దేవయాని, అన్నమేడు మహిళా పోలీస్ ప్రియాంక చిట్టమూరు మండలంలోని పలు ఎస్టీ కాలనీలకు వెళ్లి పిల్లల ఆచూకీ కోసం విచారించారు. వీణమ్మ మృతితో అనాథలైన ముగ్గురు చిన్నారుల సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్తామని వీణమ్మ తల్లి తుపాకుల పెంచలమ్మను ఆస్పత్రి వద్ద కోరామని సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. ఆమె చెప్పిన చిరునామా ప్రకారం మంగళవారం చిట్టమూరు మండలం మల్లాం గ్రామానికి వెళ్లగా పిల్లలను తీసుకొని ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. గునపాడు, చిట్టమూరు, బండాగుంట గిరిజన కాలనీల్లో విచారించినా పిల్లల ఆచూకీ లభించలేదని సీడీపీవో తెలిపారు.

ఏం జరిగింది?

అనుమానాస్పద స్థితిలో శ్రీకాకుళంవాసి మృతిలో కొత్తకోణం

మృతుడి భార్య, ఆమె స్నేహితుడిని విచారిస్తున్న పోలీసులు



గణేష్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంవాసి గణేష్ అనుమానాస్పద మృతిలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శ్రీకాకుళం చెందిన గణేష్‌కు అదే ప్రాంతానికి చెందిన మహిళతో 2011లో పెద్దల సమక్షంలో వివాహమైంది. కొద్ది సంవత్సరాల తర్వాత గణేష్ భార్యను తీసుకొని సూళ్లూరుపేటలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఆ తర్వాత ఏప్రిల్‌లో మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో ఉద్యోగంలో చేరాడు. ఈనెల 2వ తేదీ సూళ్లూరుపేట నుంచి నాయుడుపేటలోని మంగపతి నాయుడునగర్‌లో ఇల్లు తీసుకొని కాపురం పెట్టాడు. అప్పటి నుంచి మేనకూరులో ఉద్యోగానికి వెళ్లి వచ్చేవాడు. కొద్ది రోజులక్రితం నెల్లూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన యువకుడితో గణేష్ భార్య సఖ్యతగా ఉంటూ వచ్చింది. దీనిపై గణేష్ నిలదీయగా.. అతడు తన స్నేహితుడని చెప్పి గణేష్‌తో స్నేహం కలిపింది. శనివారం రాత్రి ఇంట్లోనే గణేష్, ఆ యువకుడు మద్యం తాగినట్లు తెలిసింది. ఆ తర్వాత అర్ధరాత్రి గణేష్ కిందపడి అధిక రక్తస్రావం జరిగింది. తమ ఇంటి సమీపంలోని ఓ పోలీస్ ఉద్యోగితో గణేష్‌కు పరిచయం ఉంది. దీంతో గణేష్ భార్య ఆ సమయంలో ఆయనకు ఫోన్ చేసింది. ఆయన వచ్చి గణేష్ ఫొటోలు చిత్రీకరించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు గణేష్‌ను తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గణేష్ కింద పడున్న సమయంలో ఆ ఇంట్లోనే మరో బెడ్‌రూములో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉండటం ఆ పోలీస్ ఉద్యోగి గమనించారు. ఇదే సమయంలో తన కుమారుడి మృతిపై అనుమానం ఉన్నట్లు గణేష్ తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులకు మరింత అనుమానం కలిగింది. గణేష్ భార్యను, ఆమెతో సఖ్యతగా ఉంటున్న స్నేహితుడిని పోలీసులు అదుపులో తీసుకొని విచారిస్తున్నారు. గణేష్‌కి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం ముగిశాక మంగళవారం గణేష్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం

సూళ్లూరుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను మంగళవారం డీఆర్‌ఎం విశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట షార్ కేంద్రానికి పక్కనే ఉండడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇక్కడ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమృత్ భారత్ పథకం కింద సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేశామని చెప్పారు. రూ.14.50 కోట్లతో స్టేషన్‌ను ఆధునీకరించి, ప్రయాణీకులకు అన్ని వసతులు కల్పించామన్నారు. ఈనెల 22న గురువారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. ఆయన వెంట రైల్వే చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వరన్, స్థానిక అధికారులు ఉన్నారు.

నేడు ఓజిలి మండల మీట్

ఓజిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

సూళ్లూరుపేట మండల సమావేశం

సూళ్లూరుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరుగుతుందని ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

గూడూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం వృద్ధాశ్రమంలో మంగళవారం సినీహీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, ప్రకాశం, శంకర్‌రెడ్డి, శివకుమార్, ప్రసన్న, మురళీకృష్ణ, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, షబ్బీర్, దస్తగిరి, సాయి, వినయ్ పాల్గొన్నారు.

కోటలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

కోట, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం కోట ఆర్టీసీ సెంటర్‌లో ఆయన అభిమానులు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

నాణ్యతతో మరమ్మతులు చేయాలి

కలెక్టర్ వెంకటేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం, మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. వాటిని ప్రణాళికబద్ధంగా వినియోగిస్తూ నాణ్యతతో పనులు చేయాలన్నారు. సంబంధిత శాఖ అధికారులు అవసరమైన మరమ్మతులను గుర్తించి, నిధుల అంచనాలను సిద్ధం చేయాలన్నారు. పూర్తయిన వసతి గృహాలను స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని తెలిపారు. బాలికల వసతి గృహానికి ప్రహరీగోడల నిర్మాణాన్ని కూడా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి రాజేంద్రరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరిమాణిక్యస్వామికి పుష్పయాగం




శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం ఉదయం అభిషేకాలు చేశారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామికి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పుష్పయాగం నిర్వహించారు.

మృతదేహం అప్పగింత

పెళ్లకూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునబాక దళితవాడకు చెందిన పైపూరు స్వాతి (32) ఉరేసుకుని సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే. మంగళవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ



సభ్యత్వ కార్డులు చూపుతున్న జనసేన నాయకులు

వెంకటగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో మంగళవారం జనసేన నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. సభ్యత్వం తీసుకున్న వారికి కిట్లు అందచేశారు. పెనుశిలకోన ట్రస్టుబోర్డు సభ్యుడు తోట కృష్ణయ్య, నియోజకవర్గ కన్వీనర్ జంపాల ప్రకాష్, రామారావు సునీల్. చిరంజీవులు, రాదమ్మ, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సమావేశాన్ని విజయవంతం చేయండి

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం నిర్వహించనున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘ్ కార్యదర్శి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం గూడూరు రైల్వేస్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా కంప్యూటర్, కమ్యునికేషన్ స్కిల్స్‌లో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ నిర్వాహకురాలు భవ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శారీరక దివ్యాంగులు, మూగ, చెవుడు బాధితులు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతతో పాటు 19నుంచి 34 మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఆసక్తిగలవారు పాస్‌పోర్ట్‌సైజ్ నాలుగు ఫొటోలు, ఆధార్, సదరం సర్టిఫికెట్స్‌తో గురువారం లోపు భవానీనగర్‌లోని 18-1-498ఏ, ఆంజనేయస్వామి ఆలయం వెనుక యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలి. మరిన్ని వివరాల కోసం 93474 11952, 93929 23884 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.


రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

నాయుడుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చేనెల 5వ తేదీ జరగబోవు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభలను విజయవంతం చేయాలని నాయుడుపేట యూనిట్ అధ్యక్షుడు సాయిరాం కిషోర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు గోపాల్, మమత, స్వర్ణలత, రమేష్, ఈశ్వరమ్మ, లలిత, జాన్, శిరీషా, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, అలాగే రైతులకు రుణమాఫీ అందజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి కౌలు రైతుకూ రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందజేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, శంకరయ్య, చంద్రమోహన్, రమణయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్‌లో తిరుపతి బాలికకు ద్వితీయస్థానం

తిరుపతి(క్రీడలు), మే 20 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో తిరుపతికి చెందిన బాలిక ప్రతిభ కనబరిచి రెండోస్థానం కైవసం చేసుకుంది. ఈ నెల 15నుంచి 19వ తేదీ వరకు కేరళలో 8వ ర్యాంకింగ్ నేషనల్ లెవల్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. 12-15 విభాగంలో కె.ఖ్యాతి సత్తాచాటి సిల్వర్‌మెడల్ సాధించింది. ఈ బాలిక టీటీడీ హెచ్‌ఆర్ వింగ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్తె కావడంతో పలువురు అభినందించారు. మరిన్ని పోటీలలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.